

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 08-04-2025 | సంపుటి - 22 | సంచిక - 344 రూ : 4 | పేజీలు: 8


## వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంపు

- హైదరాబాద్‌లో రూ.905కి చేరిన ధర

హైదరాబాద్: గృహావసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం సోమవారం రూ.50 చొప్పున పెంచింది. పెరిగిన ధరలు మంగళవారం నుంచే అమల్లోకి రానున్నాయి. దీంతో రాష్ట్రంలో అటు సామాన్య వినియోగదారులు, ఇటు రాష్ట్ర ప్రభుత్వంపై కలిపి ప్రతినెలా రూ.71 కోట్లకు పైగా భారం పడనుంది. రాష్ట్రంలో వినియోగదారులు నెలకు దాదాపు కోటి

తరువాయి 2లో





## విద్యార్థులపై.. కేసుల ఉపసంహారణ

- హెచ్‌సీయూ క్యాంపస్ నుంచి పోలీసు బలగాలు వెనక్కు
- సంఘాల ప్రతినిధులతో చర్చ అనంతరం మంత్రుల కమిటీ నిర్ణయం
- సామరస్య పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు

హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల విషయంలో విద్యార్థులతో నెలకొన్న వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించిన ప్రభుత్వం మొదట.. వారిపై కేసులను ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. వర్సిటీ నుంచి పోలీసు బలగాలను ఉపసంహరించుకోనుంది. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి, విశ్వవిద్యాలయం అధ్యాపకసంఘం ప్రతినిధులు, సివిల్ సొసైటీ ప్రతినిధులతో సోమవారం మంత్రుల కమిటీ

తరువాయి 2లో

## ఆరోగ్య భాగ్యం..

- ప్రతి నియోజకవర్గ కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి
- అమరావతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు
- రాష్ట్రమంతా డిజిటల్ హెల్త్ నెర్వ్ సెంటర్లు
- మొబైల్ వాహనాలతో ఇంటి దగ్గరే 20-25 రకాల వైద్య పరీక్షలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి



2లో



## సుంకాలపై తగ్గేదే లేదు

- కొన్నిసార్లు చేదు మాత్రలు తప్పవు
- చైనా దిగిరాకపోతే మరో 50% వేస్తాం
- మళ్లీ రెచ్చిపోయిన ట్రంప్

వెస్ట్ పామ్ బీచ్ (ఫ్లోరిడా): సుంకాలపై వెనక్కి తగ్గేదే లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. సుంకాల సమానత్వం సాధిస్తే తప్ప సమస్యకు పరిష్కారం లభించబోదని పేర్కొన్నారు. చైనాపై మరింతగా సుంకాలను విధిస్తామని హెచ్చరించారు. 'చైనా విధించిన 34 శాతం సుంకాలను మంగళవారంలోగా ఉపసంహరించుకోకపోతే బుధవారం నుంచి అదనంగా 50 శాతం సుంకాలను విధిస్తాం. వారితో అన్ని రకాల చర్చలను నిలిపేస్తాం' అని ట్రంప్ హెచ్చరించారు. ఓ వైపు ప్రపంచ స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నా.. ఆర్థిక మాంద్యం భయాలు వెన్నాడుతున్నా.. ప్రపంచ వాణిజ్య వ్యవస్థ మునిగిపోతున్నా ట్రంప్ తన వైఖరికే కట్టుబడి ఉండటం గమనార్హం. ఆదివారం ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ప్రయాణిస్తూ ఆయన మీడియాతో మాట్లాడారు. 'అంతర్జాతీయ

తరువాయి 2లో

## మహా సూర్య వందనం

- 21,850 మంది గిరిజన విద్యార్థుల హాజరు
- వరల్డ్ రికార్డ్ యూనియన్ సంస్థ గుర్తింపు



అరకులోయ : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని 21,850 మంది విద్యార్థులు ఒకచోట పాల్గొని 'మహా సూర్య వందనం' చేశారు. ఈ కార్యక్రమానికి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులోయ వేదికైంది. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో

తరువాయి 2లో

## శంషాబాద్.. జిందాబాద్

- రాజీవ్‌గాంధీ విమానాశ్రయం సరికొత్త రికార్డు
- గత ఆర్థిక సంవత్సరంలో 15 శాతం వృద్ధితో దేశంలోనే అగ్రస్థానం
- చివరి మూడు నెలల్లో 74 లక్షల మంది ప్రయాణంతో మరో రికార్డు

హైదరాబాద్, శంషాబాద్ : శంషాబాద్ లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికుల రాకపోకల్లో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం 15.20 శాతం వృద్ధి సాధించి.. దేశంలోని అగ్రశ్రేణి విమానాశ్రయాల కంటే ఎగువన నిలిచి రికార్డు సృష్టించింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి 202425 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 2.13 కోట్ల మంది ప్రయాణించారు. రద్దీ ఇలాగే కొనసాగితే వచ్చే ఏడాది ప్రయాణికుల సంఖ్య మూడు కోట్లు దాటే అవకాశాలున్నాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో చివరి మూడు నెలలు.. జనవరి నుంచి మార్చి వరకూ దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకల్లోనూ శంషాబాద్ అరుదైన ఘనతను సాధించింది. ఇక్కడి నుంచి నెలకు ప్రయాణించే

తరువాయి 2లో



## ఉద్యోగాలు కోల్పోయిన టీచర్ల తరఫున పోరాడతా

- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

2లో





## నాలాల్లోకి నిధులు.. రోడ్లపైకి నీళ్లు

- జీహెచ్ఎంసీలో పూడికతీతకు ఏటా రూ.50 కోట్ల ఖర్చు
- నగరంలో మెరుగుపడని వరద నీటి వ్యవస్థ
- ఇటీవలి వర్షా నికి 151 రహదారులపై ప్రవాహం

2లో

## ప్రజల కోసం మా ఇంటి తలుపులు తెరిచే ఉంటాయి

- మంత్రి నారా లోకేశ్
- ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న 624 మందికి శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలు
- ఈ స్ఫూర్తితో త్వరలోనే రాష్ట్రమంతా అమలు చేస్తామని వెల్లడి



2లో

# వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంపు

(మొదటిపేజీ తరువాయి)

వరకు సిలిండర్లు కొనుగోలు చేస్తున్నారు. దీంతో వారిపై ప్రత్యక్షంగా రూ.50 కోట్ల అదనపు భారం పడనుంది.అలాగే మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆయా లబ్ధిదారులకు సంబంధించి రూ.21.45 కోట్లను అదనంగా చెల్లించనుంది. హైదరాబాద్‌లో సిలిండర్ ధర రూ.855 నుంచి రూ.905కి పెరిగింది. పంపిణీ కేంద్రాల నుంచి దూరాన్ని బట్టి రవాణా ఛార్జీలను పరిగణనలోనికి తీసుకుంటే పలు జిల్లా కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో ఇంకాస్త ఎక్కువ ధర పడుతోంది. ఉదాహరణకు నల్గొండలో సిలిండర్ ధర రూ.877 ఉండగా అది ఇప్పుడు రూ.927కి చేరింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం గ్యాస్ కనెక్షన్ల సంఖ్య 1,42,72,200. అందులో 42.90 లక్షల మందికి ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద రూ.500కే సిలిండర్‌ను పంపిణీ చేస్తోంది. ధరలు ఎంత పెరిగినా ఆయా లబ్ధిదారులకు ప్రభుత్వం అదే ధరకు సిలిండర్‌ను సరఫరా చేస్తామని హామీ ఇచ్చింది. దీంతో మహాలక్ష్మి లబ్ధిదారులకు పెరిగిన సిలిండర్‌కు రూ.50ని రాష్ట్ర ప్రభుత్వం రాయితీ రూపంలో తిరిగి వారి ఖాతాల్లో జమ చేస్తుంది. తద్వారా ఈ పథకం లబ్ధిదారులపై ప్రస్తుతం పెరిగిన గ్యాస్ ధరల ప్రభావం ఉండదు. మహాలక్ష్మి లబ్ధిదారులు గాక మిగిలిన వినియోగదారులు 99,82,200 మంది ఉన్నారు. వారికి ఎలాంటి రాయితీ లేనందున ఒక్కో సిలిండర్‌పై రూ.50 చొప్పున వారు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఉజ్వల, సాధారణ వినియోగదారులకూ వంటగ్యాస్ ధరలు పెరిగినట్లు కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. ఉజ్వల పథకం కింద సిలిండర్ ధర రూ.503 నుంచి రూ.553కు చేరింది. విజయవాడలో సిలిండర్ ధర రూ.825.50 నుంచి రూ.875.50కి పెరిగింది.

# విద్యార్థులపై కేసుల ఉపసంహరణ

(మొదటిపేజీ తరువాయి)

చర్చించిన తర్వాత ప్రభుత్వం ఈ కీలక నిర్ణయాలు తీసుకుంది. విద్యార్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చినట్లు సమా వేశానంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. బలగాల ఉపసంహరణపై వీసీ అభిప్రాయం కోరుతూ లేఖ కూడా రాసినట్లు తెలిపారు. ఆదివారం హెచ్‌సీయూ విద్యార్థులు,అధ్యాపకులు, సివిల్ సొసైటీ ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించిన మీనాక్షి నటరాజన్.. సోమవారం మంత్రుల కమిటీ సభ్యులైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబులతో సమావేశమయ్యారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి, అధ్యాపక సంఘం ప్రతినిధులు ప్రొఫెసర్ భూక్యానాయక్, ప్రొఫెసర్ సౌమ్య దేవమ్మ, ప్రొఫెసర్ శ్రీపర్ణదాస్, వివిధ సంఘాల ప్రతినిధులు సంధ్య, సజయ, విస్సా కిరణ్‌కుమార్, ఇమ్రాన్ సిద్దిఖీ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉన్నందున, భూముల నేపథ్యంపై కాకుండా.. విద్యార్థులతో నెలకొన్న వివాద పరిష్కారంపై మాత్రమే చర్చించాలని నిర్ణయించారు. విద్యార్థులు, అధ్యాపకులు తన వద్ద ప్రస్తావించిన అంశాలను మీనాక్షి నటరాజన్ వివరించారు. జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న ఇద్దరితోపాటు విద్యార్థులందరిపైనా కేసులను ఎత్తేయడం, పోలీసు బలగాల ఉపసంహరణ వంటి చర్యలతో సామరస్య వాతావరణం ఏర్పడుతుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో మంత్రుల కమిటీ వెంటనే నిఘా విభాగం డీజీ, సైబరాబాద్ పోలీసు కమిషనర్, అదనపు అడ్వొకేట్ జనరల్ తదితరులను పిలిపించి.. న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా కేసుల ఎత్తివేతకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పోలీసు భద్రత కావాలని వర్సిటీనే కోరినందున వీసీ అభిప్రాయం తెలుసుకుని బలగాల ఉపసంహరణకు చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు సమావేశం ముగిసిన వెంటనే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. వీసీకి లేఖ రాశారు.

*** ప్రస్తుతం ఆ భూముల్లోకి అనుమతి లేదు**

సుప్రీంకోర్టు సాధికార కమిటీ.. వర్సిటీ క్యాంపస్‌ను సందర్శించడానికి ముందే 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూమిలో నష్టం అంచనా, జీవవైవిధ్య సర్వే నిర్వహించడానికి నిపుణులైన అధ్యాపకులు, పరిశోధకులకు అనుమతివ్వాలని ఈ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు కోరారు. కానీ వివాదం సుప్రీంకోర్టులో ఉన్నందున న్యాయస్థానం తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు ఎవరినీ సర్వేకు అనుమతించలేమని మంత్రుల కమిటీ స్పష్టంచేసింది. సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం.. 400 ఎకరాల భూమి పరిరక్షణకు పోలీసుల పహారా తప్పనిసరని, క్యాంపస్‌లోని మిగిలిన ప్రాంతాల్లో ఉన్న బలగాలను.. వీసీ స్పందన అనంతరం ఉపసంహరించుకుంటామంది. స్వయం ప్రతిపత్తి, బోధన, పరిశోధన లక్ష్యాల కోసం హెచ్‌సీయూ సురక్షితంగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా కోరుకుంటోందని పేర్కొంది. విద్యార్థులు కోరినట్లుగా వర్సిటీని సందర్శించడానికి మంత్రుల కమిటీ సానుకూలంగా ఉందని.. కానీ సుప్రీంకోర్టు విచారణలో ఉన్నందున ఇప్పటికిప్పుడు వర్సిటీకి రాలేమని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులకు మంత్రులు వివరించారు.

# ఆరోగ్య భాగ్యం

అమరావతి : ప్రతి శాసనసభ నియోజకవర్గ కేంద్రంలోనూ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానం (పీపీపీ)లో కనీసం 100 నుంచి 300 పడకలతో మల్టీ స్పెషాలిటీ లేదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రస్తుతం 70 నియోజకవర్గాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉన్నాయని, మిగతా 105 చోట్ల ప్రాధాన్య క్రమంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధానంలో అవసరమైన రాయితీలు ప్రభుత్వం అందజేస్తుందని సోమవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో సీఎం తెలిపారు. ''స్థలం రాయితీపై ఇస్తాం. మారుమూల, వెనుకబడిన ప్రాంతాల్లో ఏర్పాటయ్యే ఆసుపత్రులకు ఎక్కువ రాయితీలు అందజేస్తాం. ఎన్టీఆర్ వైద్య సేవ కింద 50 శాతం రోగుల్ని ఆసుపత్రులకు పంపుతాం. అవుట్ పేషెంట్లకూ ఈ పథకాన్ని వర్తింపజేస్తాం'' అని సీఎం వివరించారు. రాష్ట్రంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్నవారిలో 80 శాతం మంది... గుండె జబ్బులు, మధుమేహం, శ్వాసకోశ సమస్యలు, క్యాన్సర్, కిడ్నీ సమస్యలు వంటి 10 ప్రధాన రోగాలతోనే సతమతమవుతున్నారని తెలిపారు. మంచి ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులు, వ్యాయామం ద్వారా చాలా వ్యాధుల్ని ముందే నివారించేందుకు, ఆసుపత్రుల్లో రోజుల తరబడి గడపాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే వైద్యుల సలహాలు అందజేస్తూ రియల్‌టైమ్‌లో పర్యవేక్షించేందుకు, ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందజేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలవారీగా ఎక్కడ ఏ వ్యాధులు ఎక్కువగా ఉన్నాయో, వాటికి కారణాలేంటో వివిధ సర్వేల ఆధారంగా ఆయన వివరించారు. పిల్లలకు పాఠశాల స్థాయి నుంచి మెరుగైన ఆహారపు అలవాట్లు, మంచి జీవన విధానాన్ని సిలబస్‌గా చేరుస్తామని తెలిపారు.

*** ప్రతి వ్యాధికి ఒక్కో సలహాదారు, ప్రత్యేకాధికారి**

ప్రజల్ని ప్రధానంగా వేధిస్తున్న 10 వ్యాధుల్లో ప్రతిదానికీ దేశ, విదేశాల్లో నిపుణులైన ప్రముఖుల్ని సలహాదారులుగా నియమిస్తామని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న అత్యుత్తమ వైద్యుల్ని ఇన్‌ఛార్జిగా నియమిస్తామని తెలిపారు. 'క్యాన్సర్‌కు నోరి దత్తాత్రేయుడిని సలహాదారుగా పెట్టినట్టే, ప్రతి వ్యాధికీ ఒకర్ని నియమిస్తాం. వారి ఆధ్వర్యంలో కమిటీలు ఉంటాయి. ఆయా వ్యాధుల నివారణ, పర్యవేక్షణకు వారు వ్యూహాలు రూపొందిస్తారు' అని సీఎం తెలిపారు. రాజధాని అమరావతిలో.. మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామని చంద్రబాబు చెప్పారు. 'కేంద్ర ప్రభుత్వం దేశంలో పీపీపీ విధానంలో 25 మెడిసిటీలు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. 100 ఎకరాల్లో ఆస్పత్రులు, 40 ఎకరాల్లో నివాస భవనాలు, 40 ఎకరాల్లో వాణిజ్య భవనాలు, 20 ఎకరాల్లో సేవా కేంద్రాలు.. ఇలా మొత్తం 200 ఎకరాల్లో ప్రాజెక్టు నెలకొల్పాలన్నది ప్రతిపాదన. ప్రధాని మోదీ ఖతార్ పర్యటనకు వెళ్లినప్పుడు.. మెడిసిటీ ప్రాజెక్టుల్లో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు ఆ దేశం ఆసక్తి చూపింది. అమరావతిలో మెడిసిటీ ప్రాజెక్టుపై ఖతార్‌తోనూ చర్చలు జరుపుతాం' అని తెలిపారు.

*** రాష్ట్రమంతా డిజిటల్ హెల్త్ నెర్వ్ సెంటర్లు**

కుప్పం నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా జూన్ 15న డిజిటల్ హెల్త్ నెర్వ్ సెంటర్ ప్రారంభిస్తున్నట్టు సీఎం తెలిపారు. రెండో దశలో ఆరు నెలల్లో చిత్తూరు జిల్లాలోని మొత్తం 31 మండలాల్లో దీనిని అమలు చేస్తామని, 26 నెలల్లో మొత్తం 26 జిల్లాల్లోనూ ప్రాజెక్టు అందుబాటులోకి తెస్తామని సీఎం వివరించారు. ఆయుష్మాన్ భారత్ కింద ప్రజలందరికీ హెల్త్ కార్డులు రూపొందించి, వాటిని డిజి లాకర్‌లో భద్రపరుస్తామన్నారు. భవిష్యత్తులో వారు వైద్యం కోసం ఎక్కడ ఏ వైద్యుడి దగ్గరకు వెళ్లినా వారి మెడికల్ రికార్డంతా డిజిటల్ లాకర్ నుంచి తేలిగ్గా పొందవచ్చునన్నారు. 'బాల్యం నుంచి హెల్త్‌కార్డులు రూపొందించి ట్రాక్ చేస్తాం. ప్రత్యేక యాప్ ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు ఆరోగ్య సలహాలు అందజేస్తాం. స్పెషలిస్ట్ వైద్యుల సలహాలు అవసరమైనప్పుడు ఆన్‌లైన్‌లోను, ఆఫ్‌లైన్‌లోను అపాయింట్‌మెంట్‌లు ఏర్పాటు చేస్తాం. ఏఐ పరిజ్ఞానంతో సిబ్బందికి నిరంతరం శిక్షణ ఇస్తాం' అని తెలిపారు. మొబైల్ వాహనాల ద్వారా ఇంటి దగ్గరే 2025 రకాల ఆరోగ్య పరీక్షలు చేసి, ఆ డేటాను క్లౌడ్‌కు అనుసంధానం చేస్తామని, వైద్యులు ఎప్పుడు కావాలన్నా ఆన్‌లైన్‌లో ఆ సమాచారం తీసుకోవచ్చని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమగ్ర వైద్య సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు, మెరుగైన వైద్య సేవల్ని అందుబాటులోకి తేవడమే దీని లక్ష్యంగా ఆయన వివరించారు. టాటా ఎండీ, బిల్‌గేట్స్ ఫౌండేషన్ సంస్థలు ప్రపంచస్థాయి టెక్నాలజీ, అత్యుత్తమ విధానాల్ని అందజేస్తున్నాయని, వాటి ఆధారంగా మెరుగైన నమూనాను రూపొందిస్తున్నామని తెలిపారు.

# మహా సూర్య వందనం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రారంభించారు. అరకులోయ, పాడేరు డివిజన్ల పరిధిలోని 60 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఒకేసారి 108 రకాల సూర్య నమస్కారాలను 108 నిమిషాల్లో పూర్తిచేశారు. వరల్డ్ రికార్డ్ యూనియన్ సంస్థ ఈ కార్యక్రమాన్ని రికార్డు చేసి, ధ్రువపత్రం అందజేసింది.



# శంషాబాద్.. జిందాబాద్

(మొదటిపేజీ తరువాయి)

వారి సంఖ్య గరిష్ఠంగా 20 లక్షలే కాగా.. ఈ మూడు నెలల్లో ఏకంగా 74 లక్షల మంది రాకపోకలు సాగించడం విశేషం. ఈ విషయంలో హైదరాబాద్.. జనాభాలో ముందున్న మెట్రో నగరాలు చెన్నై, కోల్‌కతాలను దాటేసింది. అలాగే తన రోజువారీ గరిష్ఠ సగటు ప్రయాణికుల సంఖ్య 75 వేలను కూడా శంషాబాద్ జనవరి 18న అధిగమించింది. ఆ ఒక్కరోజే 94 వేల మంది ఇక్కడి నుంచి రాకపోకలు సాగించారని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారికంగా వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందినవారు కూడా విదేశీ ప్రయాణాలకు ఈ విమానాశ్రయాన్ని ఎంచుకోవడం, హైదరాబాద్‌లో తరచూ జాతీయ, అంతర్జాతీయ సదస్సులు జరుగుతుండటం వంటి పరిణామాలు ప్రయాణికుల వృద్ధికి దోహదపడుతున్నాయి.

*** విదేశాలకూ.. అత్యధిక ప్రయాణాలు..**

ఇక్కడి నుంచి దుబాయ్, దోహా, అబుధాబి సహా పలు విదేశీ నగరాలకు వెళ్లేవారూ గణనీయంగా ఉంటున్నారు. దుబాయ్‌కి నెలకు 93 వేల మంది, దోహాకు 42 వేల మంది, అబుధాబీకి 38 వేలు, జెడ్డాకు 31 వేలు, సింగపూర్‌కు 31 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

# ఉద్యోగాలు కోల్పోయిన టీచర్ల తరఫున పోరాడతా

కోల్‌కతా: సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన టీచర్లలో 'అర్హులైన అభ్యర్థుల' హక్కులను కాపాడతానని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. తాను జీవించి ఉన్నంతకాలం వారికోసం పోరాడతానని, జైలుకు వెళ్లాల్సి వచ్చినా పోరు కొనసాగిస్తానని స్పష్టంచేశారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు కారణంగా ప్రభావితమైన టీచర్లు, బోధనేతర సిబ్బందితో సోమవారమిక్కడి నేతాజీ స్టేడియంలో మమతా బెనర్జీ సమావేశం నిర్వహించారు. ''ప్రభుత్వం ఎలాంటి తొలగింపు లేఖలు పంపలేదు. కాబట్టి మీరు మీ పనిచేసుకోండి. ఈ సమయంలో స్వచ్ఛందంగా పనిచేయడానికి మీకు స్వేచ్ఛ ఉంది. నేను జైలుకు వెళ్లాల్సి వచ్చినా అర్హులైన వ్యక్తులు ఉద్యోగం కోల్పోకుండా నా ప్రాణం ఉన్నంత వరకు పోరాటం కొనసాగిస్తా. ఇదే నా వాగ్దానం'' అని పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి అభిషేక్ మను సింఘ్వీ, కపిల్ సిబల్, రాకేశ్ ద్వివేదీ, కల్యాణ్ బెనర్జీ, ప్రశాంత్ భూషణ్‌లతో న్యాయవాదుల బృందాన్ని ఏర్పాటుచేసినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ బృందం రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యోగాలు కోల్పోయిన అభ్యర్థుల తరఫున సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తుందని తెలిపారు. ''తీర్పుపై వివరణ, సవరణలను కోరడంతోపాటు చట్టపరమైన అన్ని మార్గాలను అన్వేషిస్తాం. మా ప్రభుత్వంపై నమ్మకం ఉంచండి. మేం ప్లాన్ ఏ, బీ, సీ, డీ, ఈలతో సిద్ధంగా ఉన్నాం'' అని చెప్పారు.

# ప్రజల కోసం మా ఇంటి తలుపులు తెరిచే ఉంటాయి

తాడేపల్లి : మంగళగిరి నియోజకవర్గ ప్రజల కోసం మా ఇంటి తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటాయని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలోని కొలనుకొండ, ఉండవల్లి, పెనుమాక, తాడేపల్లి పద్మశాలి బజారు, ఇప్పటం గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న 624 మందికి 'మన ఇల్లుమన లోకేశ్' కార్యక్రమం కింద శాశ్వత హక్కు కల్పిస్తూ ఆయన పట్టాలు అందజేశారు. లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరిస్తూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వేదికపైకి రాలేని వారి వద్దకు స్వయంగా వెళ్లి పట్టాలు ఇచ్చారు. మంగళగిరిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో తొలుత ఆయన మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. మంగళగిరిలో గతంలో ఓటమి పాలైనప్పుడు అందరూ ఎగతాళిగా మాట్లాడారని.. 2024లో భారీ మెజారిటీతో గెలిపించి ఇక్కడి ప్రజలు వారికి రీసౌండ్ మోగేలా సమాధానం ఇచ్చారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే మంగళగిరిలో పేదలకు ఉన్నచోటనే ఇళ్ల పట్టాలు ఇచ్చేలా తాను జీవో తీసుకొచ్చానని, ఈ ఫలాలు త్వరలో రాష్ట్రంలో ఉన్న పేదలందరికీ అందుతాయన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 7 వేల మంది పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వాటిని పరిశీలించి పట్టాలు ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఏపీ వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, తితిదే పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సుంకాలపై తగ్గేదే లేదు

(మొదటిపేజీ తరువాయి)

మార్కెట్లు పడిపోవాలని కోరుకోవడం లేదు. కానీ కొన్నిసార్లు కొన్ని నయం చేసుకోవాలంటే ఔషధాలను వాడాల్సిందే' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. 'గట్టిగా నిలవండి. ధైర్యంగా ఉండండి. ఓపికగా ఉండండి.. గొప్ప ఫలితాన్ని సాధించబోతున్నాం' అని సోమవారం అమెరికా ప్రజలనుద్దేశించిన ట్రంప్ వ్యాఖ్యానించారు. వడ్డీ రేట్లను తగ్గించాలని ఫెడరల్ రిజర్వుకు సూచించారు. అయితే సుంకాల నేపథ్యంలో ద్రవ్యోల్బణం పెరుగుతోందని, వడ్డీ రేట్ల తగ్గింపుపై కొంత కాలం ఎదురుచూడాల్సి ఉందని ఫెడరల్ రిజర్వు ఛైర్మన్ జెరోమ్ పావెల్ స్పష్టం చేశారు.

**50 దేశాలు సంప్రదించాయ్**

సుంకాల ఎత్తివేతపై చర్చల కోసం తమను 50 వరకూ దేశాలు సంప్రదించాయని అమెరికా అధికారులు వెల్లడించారు. దీనిపై ట్రంప్ స్పందించారు. 'నేను చాలా మంది నేతలతో మాట్లాడా. ఐరోపా, ఆసియా తదితర ప్రపంచ దేశాల నేతలంతా నాతో మాట్లాడారు. వారంతా అమెరికాతో ఒప్పందానికి సిద్ధంగా ఉన్నారు. వారికి నేను ఒకటే చెప్పా. మీ దేశంతో మా దేశానికి సుంకాల లోటు ఉండటానికి వీల్లేదు. నా దృష్టిలో లోటంటే నష్టమే. అందుకే మిగులు సాధించాలని ప్రయత్నిస్తున్నాం. కనీసం సమానత్వం సాధించాలనేది మా లక్ష్యం' అని ట్రంప్ పేర్కొన్నారు.

*** సంక్షోభం తప్పదు: గోల్డ్‌మన్ శాక్స్**

ట్రంప్ సుంకాలను తగ్గించినా ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థిక సంక్షోభం తప్పదని ఆర్థిక సేవల సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. ఆర్థిక వృద్ధి రేటు మందగించిందని, విదేశీ వినియోగదారుల బాయ్‌కాట్‌తోపాటు విధానాల్లో అస్పష్టతతో మూలధన వ్యయంలో క్షీణత నమోదు కావడం ఖాయమని పేర్కొంది.

# నాలాల్లోకి నిధులు.. రోడ్లపైకి నీళ్లు

హైదరాబాద్ నగరంలోని నాలాల్లో వరద నీరు సాఫీగా ముందుకెళ్లడానికి ఏటా వర్షాకాలానికి ముందే పూడికతీత పనులు చేపడుతుంటారు. వీటి కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు ఏటా సగటున రూ.50 కోట్లు వెచ్చిస్తారు. ఈ లెక్కన గత నాలుగేళ్లలో రూ.200 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఇంతగా ప్రజాధనం వ్యయమవుతున్నా... వరదనీటి వ్యవస్థ ఆశించినట్లుగా మెరుగుపడలేదని నగరంలో ఈ నెల 3న సాయంత్రం కురిసిన వర్షంతో తేటతెల్లమైంది. ఆ రోజు ఏకంగా 151 ప్రాంతాల్లో రోడ్లపై వరద ఉద్ధృతంగా పారింది. ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు మెట్రో స్టేషన్ల వైపు పరుగులు పెట్టారు. అర్ధరాత్రి దాటేంత వరకు ఇళ్లకు చేరుకోలేకపోయారు. కేవలం గంటపాటు కురిసిన వర్షానికే ఈ దుస్థితి తలెత్తడం ఆందోళన కలిగిస్తోంది. అత్యవసర నిధులు సరేసరి... వర్షం కురిస్తే జీహెచ్‌ఎంసీ అధికారులకు పండగే. రోడ్లపై నిలిచే నీటిని తోడేందుకు అత్యవసరం పేరిట పనులు చేపట్టి... తర్వాత బిల్లులు సమర్పిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఈ పనులు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. పైగా వీటి వివరాలను బహిర్గతం చేయడంలేదు. పూడికతీత పనుల్లోనూ ఇష్టానుసారంగా నిధులు స్వాహా చేస్తున్నారని, తోడిన మట్టిని ఎక్కువ చేసి చూపిస్తున్నట్లు విమర్శలున్నాయి. తప్పుడు లెక్కలు ఉంటున్నాయని ప్రజాప్రతినిధులు సైతం ఆరోపిస్తున్నారు. ప్రస్తుత ఏడాది కోసం ఇటీవల 203 పూడికతీత పనులకు టెండర్లను పిలిచారు. వాటిలో 9 టెండర్ల దశలో, 97 మొబిలైజేషన్ దశలో, 97 కొనసాగుతున్న దశలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.







# ట్రైబల్ మ్యూజియంను ప్రారంభించిన గవర్నర్

*** గిరిజన సాంప్రదాయ స్వాగతం**

*** గిరిజన సంస్కృతి గొప్పది : గవర్నర్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం ఐటిడిఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ట్రైబల్ మ్యూజియంను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ వర్మ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ వేడుకకు హాజరైన రాష్ట్ర గవర్నర్ కు ఐటీడీఏ వద్ద గిరిజన సంప్రదాయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ ట్రైబల్ మ్యూజియంను సందర్శించారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ట్రైబల్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన వివిధ వస్తువులను చూసి గవర్నర్ ఐటీడీఏ పీవో రాహుల్ ని ప్రత్యేకంగా అభినందించారు. భావితరాలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని గవర్నర్ ఈ సందర్భంగా ప్రశంసించారు. గిరిజనులను ఇంకా అన్ని విధాల అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని గవర్నర్ ఈ సందర్భంగా పిఓ కు తెలిపారు. ఇంకా ట్రైబల్ మ్యూజియంను ఆధునికరించాలని కోరారు. గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలకు సంబంధించిన కళాఖండాలను తయారు చేస్తున్న గిరిజనులకు వాటిని సందర్శకులకు విక్రయించి ఉపాధి అవకాశాలు కల్పించుకునేలా చొరవ చూపాలని ఆయన అధికారులకు సూచించారు. ట్రైబల్ మ్యూజియం వద్ద ఏర్పాటు చేసిన వివిధ రకాల మట్టి ఇల్లులు, ట్రెడిషనల్ హౌస్ లు వీక్షించి గవర్నర్ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఆదివాసి గిరిజన మహిళలు తయారుచేసిన గిరిజన వంటకాలను చవిచూసి మరల భద్రాచలం వచ్చినప్పుడు తప్పనిసరిగా గిరిజన వంటకాలను తనివి తీర భోజనం చేస్తానని ఆయన మహిళలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గవర్నర్ ఫోటో దిగి అక్కడున్న వారిని ఆనందింప చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, ఐటీడీఏ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సోమవారం జరిగిన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నర్సింలు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండిరచిన ధాన్యం దళారులకు విక్రయించి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్ కొమురయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజిరెడ్డి తదితరులున్నారు.

## ఆలేరు పట్టణంలో బీటీ రోడ్డు పనులను ప్రారంభం



యాదాద్రి భువనగిరి జిల్లా, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో రైల్వే అండర్ పాస్ వద్ద బీటీ రోడ్డు పనులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. నిర్మాణం జరుగుతున్న బీటీ రోడ్డు వద్ద కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు..పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఆలేరు నుండి కొలనుపాక రోడ్డు వద్ద గత ప్రభుత్వాలు పట్టించుకోకుండా నిలిచిపోయిన అండర్ పాస్ బ్రిడ్జి పనులను ప్రారంభించి ఈ ప్రజాప్రభత్వం లో పూర్తి చేశామన్నారు. దానితో పాటు బీటీ రోడ్డు పనులను కూడా ప్రారంభించారని తెలిపారు.

# యాదగిరిగుట్ట పట్టణం లో భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరణ



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : భారతీయ జనతా పార్టీ 46 ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా యాదగిరిగుట్ట పట్టణం లోని వివిధ వార్డుల్లో భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది దీనికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు ఊట్కూరు అశోక్ గౌడ్, జిల్లా కార్యదర్శి వైజయంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్ మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6 తారీఖున భారతీయ జనతా పార్టీ ప్రస్థానం అనే ప్రారంభమైంది నేటికి 46 ఏళ్లు అప్పటినుండి ఇప్పటివరకు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ప్రజాభిమానాన్ని చురగొని ఈరోజు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా భారతీయ జనతా పార్టీ గా అవతరించింది ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడు వలె పోరాడుతూ సమాజ హితం కోసం జాతీయ సమైక్యత కోసం పోరాడుతున్నాడు సామాన్య కార్యకర్త కష్టాన్ని గుర్తించి కార్యకర్తకు అందెలమెక్కించే పార్టీ ఏదైనా ఉందంటే అది బిజెపి మాత్రమే మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ వచ్చాక దేశంలో సుస్థిరమైన పాలన కొనసాగుతుంది అవినీతికి తావు లేకుండా ప్రజల శ్రేయస్య పరమావధిగా ప్రధాని పనిచేస్తున్నారు. ఈరోజు ప్రపంచ అగ్రనేత మోడీ కావడం మన యొక్క అదృష్టం బడుగు బలహీన వర్గాల ప్రజలు కూడా బిజెపిలో అత్యంత స్థానం పొందవచ్చు పట్టణంలో వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి సత్తా ఏంటో చూపిస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ నెంబర్ రచ్చ శ్రీను, పట్టణ అధ్యక్షులు కర్రే ప్రవీణ్, పట్టణ ప్రధాన కార్యదర్శిలు ఆకుల చంద్రమౌళి జిల్లా భానుచందర్ మండల మాజీ అధ్యక్షులు గుంటుపల్లి సత్యం పట్టణ ఉపాధ్యక్షులు బందరు మల్లేష్ గౌడ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు బోడ బుచ్చిబాబు, ఓబీసీ మోర్చా అధ్యక్షులు మందోజి నరేష్,సీనియర్ నాయకులు నల్ల వెంకటరెడ్డి లంకలపల్లి శ్రీనివాస్, తాళ్ల భాస్కర్ రెడ్డి, దొమ్మట నరేష్, కర్ర లక్ష్మయ్య, నల్ల వాసుదేవరెడ్డి వాల్మీకి అజయ్, పలుగుల సురేష్, ఉమామహేష్, గోపి, భాస్కర్, శివ, వంగ శ్రీకాంత్, కృష్ణ, శివరాత్రి వంశీ, ప్రవీణ్, ,భాను, కళ్యాణ్, శరత్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న డిగ్రీ ప్రాక్టికల్ పరీక్షల బహిష్కరణ

యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ప్రైవేట్ కళాశాల అసోసియేషన్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఫైనాన్స్ సెక్రటరీ దరిపల్లి ప్రవీణ్ కుమార్ ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఈనెల మొదటి విడత ప్రాక్టికల్ పరీక్షలను గ్రూప్ ఎ 2 వ తేదీ నుండి 5 వ తేదీ వరకు జరగవలసిన ప్రాక్టికల్ పరీక్షలు ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలు బహిష్కరించిన విషయం తెలిసిందే అలాగే రెండవ విడత ప్రాక్టికల్ పరీక్షలు గ్రూప్ బి 7 వ తేదీ నుంచి 9 వ తేదీ వరకు జరగవలసి ఉండగా ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడం వలన డిగ్రీ రెండు, నాలుగువ, ఆరవ సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలను బహిష్కరిస్తున్నట్లు మహాత్మా గాంధీ యూనివర్సిటీ ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ ఫైనాన్స్ సెక్రటరీ శ్రీ సాయి కృప డిగ్రీ అండ్ పీజీ కళాశాల కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా కళాశాలలకు రావలసిన ఫీజు రియంబర్స్మెంట్, విద్యార్థుల ఉపకార వేతనాలు చెల్లించకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. యాజమాన్యాలు కళాశాల నిర్వహణ లెక్చరర్ల వేతనాలు చెల్లించడానికి అప్పులు చేశాయని ఇక అప్పు పుట్టే పరిస్థితి కూడా లేదని ఈనెల 2 నుంచి అనగా గ్రూప్ ఏ ప్రాక్టికల్ పరీక్షలు బహిష్కరించినా.. ప్రభుత్వం నుండి స్పందన రాలేదని కావున ఈనెల 11 న జరగవలసిన థియరీ పరీక్షల వరకు కూడా అప్పటికి ప్రభుత్వం స్పందించకన్నట్లయితే ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్న థియరీ పరీక్షలు కూడా బహిష్కరిస్తామని హెచ్చరించారు. వెంటనే ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేసి పరీక్షలు సజావుగా సాగిలా చూడాలని దరిపల్లి ప్రవీణ్ కుమార్ అన్నారు.

# విలేఖరికి బిఆర్ఎస్ నాయకుల పరామర్శ



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల ఆంధ్రజ్యోతి రిపోర్టర్ చెవుల మైలారం మాతృమూర్తి గత ఐదు రోజుల క్రితం కన్నుమూశారు. ఈ మేరకు సోమవారం రిపోర్టర్ చెవుల మైలారంను, ఆయన కుటుంబాన్ని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ రైతు బంధు అధ్యక్షులు కల్వకుంట్ల గోపాల్ రావు సోమవారం పరామర్శించారు. ఆయన వెంట ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ కో అప్షన్ మెంబర్ సర్వర్ పాషా, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చెవుల మల్లేశం, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్, మాజీ కో అప్షన్ మెంబర్ అన్వర్, ముస్తాబాద్ మండల యూత్ అధ్యక్షులు శీలం స్వామి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కంచం నర్సింలు, కోడె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కి ఘన సన్మానం




జిన్నారం,ప్రజాస్ఫూర్తి 07, గుమ్మడిదల మండలం నూతన తహసీల్దార్ పరమేశ్వర్ ను కానుకుంట నాయకులు ఘనంగా సన్మానించారు. మండల నాయకులు శ్రీనివాస్ రెడ్డి నూతన తహశీల్దార్ ను కలిసి కానుకుంట గ్రామంలోని సమస్యలను తహశీల్దార్ కి విన్నవించారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి సన్మానించారు.

## ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన నెల్లికంటి సత్యంకు ఘన సన్మానం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: శాసనమండలి సభ్యునిగా నెల్లికంటి సత్యం సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను సిపిఐ జాతీయ సమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. శాలువాతో శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నెలకొన్న సమస్యలపై శాసనమండలి దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె శ్రీనివాస్ చౌటుప్పల మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి, పగిళ్ల మోహన్ రెడ్డి, టంగుటూరి రాములు రొండి నర్సింహ్మా, కొండూరు వెంకటేష్, పాసు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే




ప్రజాస్ఫూర్తి, కాప్రా : దేశ వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాకంగా భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ "జై బాపు జై భీమ్ జై సంవిధాన్"రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టడం జరిగింది. అందులో భాగంగా సోమవారం కాప్రా డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాలుగోన్నారు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తుందని, ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తూ ప్రజల హక్కులను కాల రాస్తుందని మండిపడ్డారు.కాబట్టి రాజ్యాంగం, మహాత్మా గాంధీ, అంబేద్కర్ సిద్ధాంతాలను దేశ ప్రజలుగా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రజలకు అవగాహన కల్పించారు





# నేత్ర పర్వంగా రామయ్య పట్టాభిషేకం...

* **హాజరైన రాష్ట్ర గవర్నర్**
* **స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పణ**
* **భద్రాద్రిలో మిన్నంటిన రామనామ స్మరణలు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కళ్యాణ రాముడు రారాజుగా మారారు. 'తక్కువేమీ మనకు రాముడు ఒక్కడుండు వరకు .....'అంటూ భక్తుల శ్రీరామ నామ స్మరణలు మిన్నంటాయి. అర్చకుల వేద మంత్రోచ్ఛారణతో మిథిలా ప్రాంగణం పులకించింది. దక్షిణ అయోధ్యపురి భద్రగిరి భక్తులతో అలరారింది. శ్రీరామ పట్టాభిషేకం వేడుక నేత్రపర్వంగా సాగింది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ వర్మ ఈ మహోత్సవ వేడుకలకు విచ్చేసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన వేడుకలైన శ్రీ సీతారాముల కళ్యాణం, పట్టాభిషేకం తదితర మహోత్సవాలకు హాజరైన భక్తజనం తీపి జ్ఞాపకంతో వెనుదిరిగింది.

* **వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం:**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలోని మిథిలా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన శ్రీరామ పట్టాభిషేకం వేడుక భక్తులను అలరించింది. తొలుత రామాలయం భద్రుని మండపంలో అర్చక స్వాములు స్వామివారి పాదుకలకు అభిషేకం జరిపారు. రాజ లాంఛనాలతో పవిత్ర పావన గౌతమీ నదీ తీరం నుంచి తీర్థములు తీసుకొచ్చారు. భాజా భజంత్రీల సందడి, సన్నాయి మేళాలు, భక్తుల కోలాటంతో శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని ఊరేగింపుగా మిథిలా ప్రాంగణానికి తీసుకొచ్చారు. శిల్పకళా శోభిత కళ్యాణ మండపంపై స్వామివారు ఆశీనులయ్యారు. అర్చక స్వాములు తొలుత విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామివారికి పాదుకలు, రాజదండం, రాజముద్రిక, స్వర్ణ కిరీటం, ఖడ్గం, రత్నాభరణం ధరింప చేశారు. శ్రీరామ పట్టాభిషేక పారాయణం గావించారు. ఋగ్వేదము, యజుర్వేదం, సామవేదం, ఆదరణ వేదం, విష్ణు పురాణం, భగవత్ శాస్త్రం తదితర పారాయణములు గావించారు. పుష్కర నది జలాలతో మహాకుంభ తీర్థప్రోక్షణ చేశారు. పుష్కర నది జలాలతో మహాకుంభ తీర్థప్రోక్షణ





గావించారు.11 శ్లోకాలను పఠించి స్వామివారికి హారతి ఇచ్చారు. అర్చక స్వాములు భక్తులచే పలు స్తోత్రాలను పఠింపజేశారు. శ్రీరామ నామ స్మరణలతో మిథిలా ప్రాంగణం ప్రతిధ్వనించింది. పట్టాభిషేకం అనంతరం భక్తులపై అర్చక స్వాములు పుణ్యనదీ జలాలను చల్లారు.తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శ్రీరామ పట్టాభిషేకం వేడుకకు హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. మహోత్సవాన్ని ఆద్యాంతం తిలకించారు. తొలుత రామాలయంలో గవర్నర్ స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగే శ్వరరావు, భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఐటీడీఏ పిఓ రాహుల్, రామాలయం ఈవో రమాదేవి తదితరులు పట్టాభిషేకం వేడుకలో పాల్గొన్నారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో ముఖ్య వేడుకలైన శ్రీ సీతారాముల వారి కళ్యాణం, శ్రీ రామ పట్టాభిషేకానికి దేశ నలుమూలల నుంచి హాజరైన భక్తజనం తీపి జ్ఞాపకాలతో వెనుదిరిగారు. ఈ వేడుకల విజయ వంతంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి కీలక భూమిక పోషించారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం.. ఆరోగ్యానికి మించిన సంపద లేదు

* **జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మారుతున్న కాలానికి అనుగుణంగ ఆరోగ్య సమస్యలపై అవగాహనతో మెలుగుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన, ఆనందభరితమైన జీవితాన్ని సాగించాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి అన్నారు. సోమవారం స్థానిక బాబు క్యాంప్ గవర్నమెంట్ హైస్కూల్ లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగ జరిగిన అవగాహన కార్యక్రమంలో న్యాయమూర్తి ముఖ్యఅతిథిగ పాల్గొన్నారు. ఈ సందర్భంగ న్యాయమూర్తి మాట్లాడుతు ఆరోగ్యమే మహాభాగ్యం.. అని ఆరోగ్యానికి మించిన సంపద లేదని అన్నారు. ఆరోగ్య సమస్యలు లేని జీవితాన్ని గడపాలంటే ఖచ్చితంగా మన జీవనశైలి పద్ధతులను మార్చుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించాలని అన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవడం, తగినంత నీరు త్రాగడం ద్వారా శారీరక పనితీరు సక్రమంగా ఉంటుందని అన్నారు.ఆరోగ్యంగా ఉంటేనే మానసికంగ దృఢంగా ఉంటారని అన్నారు. ఒత్తిడిని అధిగమించాలంటే దైనందిన జీవితంలో యోగా తప్పనిసరి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం యొక్క ప్రాముఖ్యత గురించి డిప్యూటీ డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ జయలక్ష్మి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం అనంతరం బాబు క్యాంపు లో ఉన్న భవిత సెంటర్ ను సందర్శించారు అక్కడ పిల్లలకు అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యుడు లక్కినేని సత్యనారాయణ, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి. నిరంజన్ రావు, డిప్యూటీ డి ఈ ఎం ఓ ఫయాజుద్దీన్, పాఠశాల హెడ్మాస్టర్ నీరజ, ఉపాధ్యాయులు షేక్ దస్తగిరి, చందర్ రావు, సునందిని తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని వినతి



ప్రజాస్ఫూర్తి, కాప్రా : మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో మంచినీరు సరఫరా సమస్యలపై జలమండలి జీఎం సంతోష్ తో సమావేశమైన స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్. ఈ సమావేశంలో మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని మంగాపురం వెంకటేశ్వర స్వామీ ఆలయం, రాజీవ్ నగర్, కృష్ణానగర్ రోడ్నం 1&7 డ్రైనేజీ, ఇంద్రనగర్ ఫేజ్ 1 గాంధీ విగ్రహం వెనకాల, వేసవి కాల దృష్ట్యా మెరుగైన మంచినీటి సరఫరా కోసం మరి కొన్ని జంక్షన్ల ఏర్పాటు కాలనీలలో మంచినీరు సరఫరా, డ్రైనేజీ సమస్యలపై జలమండలి జీఎం సంతోష్ తో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సమావేశమై వినతి పత్రం అందజేసిన స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్. తాగునీటి సరఫరా సక్రమంగా రావడం లేదని, మల్కాజిగిరి జలమండలి వారు మెయింటెనెన్స్ చేయకపోవడం వల్ల రాఘవేంద్ర నగర్, జవహర్ నగర్ డ్రైనేజీ పైప్ లైన్ ఓవర్ ఫ్లో అయి హెచ్ బీ కాలనీ ఫేజ్ 1, వెంకటేశ్వరనగర్ కాలనీ రోడ్లపై చేరి కాలనీవాసుల ఇబ్బందులకు గురి అవుతున్నారని అలాగే హెచ్ బీ కాలనీ ఫేజ్ 2 మురుగు నీటితో కలుషితంగా వస్తున్నయాని, కావున ఈ సమస్యలపై తగులు చదివి తీసుకోవాల్సిందిగా కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం సతీష్, ఏఈ వేణుగోపాల్, హెచ్ బీ కాలనీ ఫేజ్ 1 & ఫేజ్ 2 కాలనీల అధ్యక్షులు శివరాం ప్రసాద్ వెంకటాచారి, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 219 కోట్ల ట్రైకార్ రుణాలను తక్షణం విడుదల చేయాలి

* **గిరిజన సంక్షేమ కార్యాలయాన్ని ముట్టడించిన గిరిజన సంఘాల జేఏసీ**

ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్ : ముట్టడి కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి ఆదివారం అర్ధరాత్రి నుండి అన్ని జిల్లాలతో పాటు హైదరాబాదులోని గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించారని నాయకులు ఆరోపించారు.పోలీసుల నిర్బంధాన్ని ఛేదించి వందలాదిమంది గిరిజన నాయకులు, కార్యకర్తలు సోమవారం హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని గిరిజన సంక్షేమ భవన్ ను ముట్టడించారు. కార్యాలయం వద్దకు వెళ్లకుండా చుట్టూ బారికేడ్లు పెట్టి వందలాదిమంది పోలీసులతో సహారా కాశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ పోలీసులు,భారీ కేడ్లను సైతం ఛేదించుకొని కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్,ఆర్ శ్రీరాం నాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అజ్మీర రామ్మూర్తి, రమావత్ అంజయ నాయక్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎం. రాంబాల్ నాయక్,ఎల్ హెచ్ పి ఎస్ జాతీయ అధ్యక్షులు దాస్ రాం నాయక్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి రఘు ఎరుకల, కండల వెంకటేష్ ఎరుకల వర్కింగ్ ప్రెసిడెంట్, మల్లేష్ ఎరుకల ఎరుకల సంఘం అధ్యక్షులు ఈసీఐఎల్, గిరిజన జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వినోద్ నాయక్ తదితరులు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న 219 కోట్ల ట్రైకార్ రుణాలను తక్షణం విడుదల చేసి శాంక్షన్ అయి,చెక్కులు సిద్ధంగా ఉన్న లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.రాజీవ్ యువ వికాస్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా ప్రారంభించడంతో ట్రైకార్ లో 201921 సంవత్సరాల్లో శాంక్షన్ అయి చెక్కులు సిద్ధంచేసి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు పడని లబ్ధిదారులు తీవ్ర ఆందోళన



చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన 219 కోట్ల బకాయిలను రద్దు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కుట్రలు చేస్తున్నట్టు ఆరోపించారు. రాజీవ్ యువ వికాస్ పథకం ప్రారంభంతో దశాబ్దాలుగా గిరిజన యువతకు రుణ సౌకర్యం కల్పిస్తున్న ట్రై కార్ సంస్థను పూర్తిగా నిర్వీర్యమవుతుందనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు.గత రాష్ట్ర ప్రభుత్వం ట్రైకార్ సంస్థ ద్వారా 20192021 సంవత్సరాల్లో గిరిజన యువతి యువకుల నుండి వేలాది దరఖాస్తులను స్వీకరించి అందులోనుండి 30 వేల మందికి రుణాలను మంజూరు చేస్తూ లబ్దిదారులుగా గుర్తించిందన్నారు. లబ్ధిదారులు రుణాల అర్హత సాధించేందుకు బ్యాంకుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగి షూరిటీని పొంది రుణాలకు అర్హత సాధించారన్నారు. ఒక్కో లబ్ధిదారునికి 50 వెళ్లనుంది 10 లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు ట్రైకార్ సంస్థ లిస్టును ఫైనల్ చేసి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడానికి 219 కోట్ల రూపాయల చెక్కులను రెడీ చేసి క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖకు పంపించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లబ్దిదారుల ఖాతాల్లో వేస్తున్నట్టు గత ఆరు నెలలుగా ప్రకటిస్తుందని తెలిపారు.ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న 30 వేల మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఖాతాల్లో జమ చేయకుండానే హడావిడిగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టడం లబ్దిదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నాయని అన్నారు. వీరందరూ రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాల కొరకు కొత్తగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవడానికి వెళితే ఇప్పటికే రుణాలు తీసుకున్నట్టు చూపిస్తూ ఆన్ లైన్ దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయన్నారు. దీనితో వేలాది మంది గిరిజన యువత రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాలు పొందకుండా అనర్హులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ట్రైకార్ సంస్థ ద్వారా గిరిజన యువతి యువకులకు రుణాలు మంజూరు చేస్తున్నటువంటి ట్రైకార్ సంస్థను నిర్వీర్యం చేయడానికే రాజీవ్ యువ వికాసం పథకంలో విలీనం చేయడం గిరిజన యువతి యువకులకు తీవ్ర నష్టం జరుగుతుందని విమర్శించారు.ట్రై కార్ సంస్థలో యూనిట్ కాస్ట్ 50 వెల నుండి 10 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉండగా రాజీవ్ యువ వికాసం లో 4 లక్షల వరకే రుణ సౌకర్యాలు కల్పించడం అన్యాయమని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ట్రై కార్ సంస్థలో పెండింగ్ లో ఉన్న 219 కోట్ల రుణాలను తక్షణం విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలి. లేకపోతే లబ్ధిదారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని గిరిజన సంఘాల జేఏసీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ వచ్చే విధంగా ప్రభుత్వం పైన వత్తడి తీసుకురావాలి

* **న్యాయవాది నాగేంద్ర**

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : రోజు రోజుకి న్యాయవాదుల పైన దాడులు పెరిగిపోతున్నాయని న్యాయవాది నాగేంద్ర అన్నారు. ఆదివారం నాంపల్లి కోర్టు న్యాయవాది పైన జరిగినటువంటి దాడిని ఖండిస్తూ సోమవారం కూకట్ పల్లి న్యాయవాదులు విధులను బహిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల పైన జరుగుతున్న దాడులను ఖండించారు. హైకోర్టు బార్ అసోసియేషన్, హైకోర్టు న్యాయవాదులందరూ పెద్దన్న పాత్ర పోషించాలన్నారు. ఇతర బార్ అసోసియేషన్, న్యాయవాదుల ఫెడరేషన్ అందరూ ముందుకు వచ్చి అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ వచ్చే విధంగా ప్రభుత్వం పైన వత్తడి తీసుకురావాలన్నారు. లేనిపక్షంలో



న్యాయవాదులు అందరూ కలిసి అసెంబ్లీని ముట్టడించి న్యాయవాదుల యొక్క హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# కలెక్టర్, ఎస్పీలను అభినందించిన మంత్రి తుమ్మల

*** నవమి ఏర్పాట్లపై తుమ్మల సంతృప్తి**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శ్రీరామనవమి వేడుకలను ఎంతో అట్టహాసంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజులను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని గత వారం రోజులుగా కలెక్టర్, ఎస్పీలు ప్రతినిత్యం అధికారులతో సమీక్షలను నిర్వహించడం, ఏర్పాట్లను స్వయంగా పరిశీలించడం జరిగింది. నవమి రోజు భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేయడమే కాకుండా, సీతారాముల కళ్యాణంలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా గిరిజన మ్యూజియంలో ఆదివాసీలు, గిరిజనులు ఉపయోగించే వస్తువులను ఏర్పాటు చేసి, మ్యూజియంను తిలకించేందుకు వచ్చిన ప్రజలకు వాటి గురించి తెలుసుకునేలా చేశారు. కన్నుల పండువగా జరిగిన సీతారాముల కళ్యాణం, పట్టాభిషేకం కార్యక్రమాలను భక్తులు వీక్షించడంతోపాటు సీతారాముల దర్శనం వద్ద ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవడంపట్ల మంత్రి అభినందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ వర్మ పర్యటనలో ఆటంకాలు కలుగకుండా చూసుకొన్నారని కొనియాడారు. కలెక్టర్, ఎస్పీలు కలిసి జిల్లా అధికారులను సమన్వయపరుచుకుని శ్రీరామనవమి కార్యక్రమాలను నిర్వహించడంపట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంతృప్తి వ్యక్తం చేశారు.

## దేశంలోనే చారిత్రాత్మక నిర్ణయం మన ప్రజా ప్రభుత్వం




యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : భువనగిరి నియోజకవర్గంలోని భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి లు పాల్గొని ప్రారంభించారు.

## ఘనంగా బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం లోని కేపీహెచ్ బీ డివిజన్లో గల 4 వ ఫేస్ నందు కూకట్పల్లి నియోజకవర్గం ఇన్చార్జి మాధవరం కాంతారావు పాల్గొని భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మహిళా మోర్చా సెక్రటరీ, ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ రేవతి, కెపిహెచ్బి డివిజన్ కన్వీనర్ గురు ప్రసాద్, మహిళా మోర్చా అధ్యక్షురాలు నాగలక్ష్మి, స్వర్ణ, శిరీష, రవి, సుబ్బారావు, యాదవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి గ్రామంలో గల శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కూకట్ పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు, సతీమణి మాధవరం లక్ష్మీబాయి, కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు జరుగుతున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా సీతారామచంద్రస్వామి సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమంలో శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు స్థానిక భక్తులతో కలిసి పాల్గొన్నారు.

# అరకులో 21 వేల మంది విద్యార్థులతో... 'మహా సూర్యవందనం'



అరకు: అరకులో 21 వేల మంది విద్యార్థులతో ప్రపంచ రికార్డు సాధించేలా 'మహా సూర్యవందనం' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. 21 వేల మంది విద్యార్థులతో 108 సార్లు సూర్యనమస్కారాలు చేయించారు. అరకులోని గిరిజన సంక్షేమ వసతి గృహం మైదానంలో ఈ మహా సూర్యవందనం కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సంధ్యా రాణి ప్రారంభించగా.. ఐటీడీఏ, గిరిజన విద్యాలయాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నమోదు చేసేందుకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధి ఏలేసా రైనాడ్ వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ.. "గిరిజన ప్రాంతంలో జరిగిన గొప్ప కార్యక్రమం ఇది. 5 మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ఈ మహా సూర్యవందనంలో పాల్గొన్నారు. గిరిజన బిడ్డలు తలచుకుంటే ఏదైనా సాధిస్తారు అనడానికి ఇదే నిదర్శనం" అని అన్నారు. అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ సహకారంతో ఇది సాధ్యమైందన్నారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల నిత్య జీవితంలో ఇది నిరంతర అభ్యాసంగా నిలవాలన్నారు.

# జీఆర్ఎంబీ సమావేశం.. గోదావరిబనకచర్ల ప్రాజెక్టుపై చర్చ




హైదరాబాద్: గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) ఛైర్మన్ ఏకే ప్రధాన్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని జలసౌధలో జీఆర్ఎంబీ సమావేశం జరిగింది. ఏపీ ప్రభుత్వం తలపెట్టిన గోదావరి బనకచర్ల ప్రాజెక్టు గురించి తెలంగాణ ప్రస్తావించింది. ఏపీ ప్రభుత్వం సమాచారం, వివరాలు దాచిపెడుతోందని తెలంగాణ అధికారులు ఆరోపించారు. ప్రాజెక్టు అంశంపై బోర్డుకు కేంద్రం నుంచి లేఖ వచ్చి 5 నెలలు గడిచాయని, కేంద్రం నుంచి లేఖలు వచ్చినా తమకు కనీస సమాచారం ఇవ్వలేదని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు పూర్తి వివరాలు, దానివల్ల తెలంగాణపై ప్రభావం తదితర వివరాలు ఏపీ ప్రభుత్వం అందించాలని తెలంగాణ అధికారులు బోర్డును కోరారు. అనుమతులు లేకుండా ప్రాజెక్టు చేపడుతున్నారని తెలంగాణ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఏపీ అధికారులు బనకచర్ల ప్రాజెక్టుకు ఇంకా డీపీఆర్ తయారు చేయలేదని వివరణ ఇచ్చారు. మరోవైపు పెదవాగు ప్రాజెక్టు ఆధునీకరణ పనులపై సమావేశంలో చర్చించారు. రూ.15 కోట్లతో తక్షణ మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జీఆర్ఎంబీ కార్యదర్శి అజగేషన్ వ్యవహార శైలిని తెలంగాణ అధికారులు ప్రస్తావించారు. రాష్ట్రాలను సంప్రదించకుండానే బోర్డు సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా జీఆర్ఎంబీలో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న ఏపీ, తెలంగాణకు చెందిన అధికారులను అజగేషన్ వేధిస్తున్నారని, మహిళా ఉద్యోగులను అసభ్యకర మాటలతో దూషిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ నీటి పారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు తదితర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## అన్నమయ్య జిల్లాలో రోడ్డు ప్రమాదం.. హంద్రీనీవా డిప్యూటీ కలెక్టర్ మృతి




సంబేపల్లి: అన్నమయ్య జిల్లా సంబే పల్లి మండలం యర్రగుంట్ల వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో హంద్రీనీవా కెనాల్ (హెచ్ఎన్ఎస్) పీలేరు యూనిట్ 2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ (50) మృతిచెందగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను రాయచోటి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రిలో బాధితులను జిల్లా కలెక్టర్ శ్రీధర్ పరామర్శించారు. మృతిచెందిన డిప్యూటీ కలెక్టర్ రమ.. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. ఆమె స్వస్థలం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం. పీలేరు నుంచి రాయచోటిలోని కలెక్ట రేట్ గ్రీవెన్స్ కార్యక్రమానికి రమ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.




## అక్రమ తరలింపు కేసు.. మరో ముగ్గురికి నోటీసులు

నెల్లూరు: నెల్లూరులో Quartz అక్రమ తరలింపు కేసులో మరో ముగ్గురికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. నేడు ఉదయం 11 గంటలకు నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటికే 10 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. Quartz అక్రమ తరలింపు కేసులో ఏ4గా వైకాపా నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఉన్నారు. తాజాగా ఉరిబండి ప్రభాకర్‌రెడ్డి, ఉరిబండి చైతన్యకు, కాకాణి గోవర్ధన్‌రెడ్డి చిన్న అల్లుడు గోపాలకృష్ణారెడ్డికి నోటీసులు ఇచ్చారు. ముగ్గురూ నేడు విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. విచారణ కోసం ఇప్పటికే మూడు సార్లు నోటీసులిచ్చినా కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరు కాలేదు.

# సరిహద్దు భద్రతకు.. ఎలక్ట్రానిక్ నిఘా వ్యవస్థ: అమిత్ షా

శ్రీనగర్: దేశ సరిహద్దుల్లో చొరబాట్లను నివారించేందుకు కేంద్రం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే సరిహద్దుల్లో భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు ఎలక్ట్రానిక్ నిఘా వ్యవస్థను మోహరిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. ఉగ్రవాదుల చొరబాట్లకు అడ్డుకట్ట వేసేందుకు, భూగర్భ సొరంగాలను గుర్తించి ధ్వంసం చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తామని తెలిపారు. జమ్మూకశ్మీర్ హీరానగర్ సెక్టార్‌లోని బీఎస్ఎఫ్ బోర్డర్ ఔట్‌పోస్ట్ 'వినయ్'ను సందర్శించిన కేంద్రమంత్రి.. సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. "సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు రెండు నమూనాల ఎలక్ట్రానిక్ నిఘా వ్యవస్థలను అభివృద్ధి చేశాం. వాటి ఏర్పాటు అనంతరం సమాచార సేకరణ, శత్రువుల ఆగడాలకు వేగంగా అడ్డుకట్ట వేయడం సులభతరం అవుతుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చొరబాట్లు,




సొరంగాలను గుర్తించేందుకు అనేక పరీక్షలు నిర్వహించాం. కొన్ని సంవత్సరాల్లో భారత్-పాకిస్థాన్, భారత్- బంగ్లాదేశ్ సరిహద్దులు పూర్తిస్థాయిలో సాంకేతికత నిఘాలో ఉంటాయి" అని అమిత్ షా తెలిపారు. భద్రతకు సంబంధించి 26కు పైగా ప్రాజెక్టులు ప్రస్తుతం పరీక్ష దశలో ఉన్నాయని, వాటిలో యాంటీ-డ్రోన్ టెక్నాలజీ కూడా ఉందని చెప్పారు. వచ్చే మార్చి కల్లా సానుకూల ఫలితాలు సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. పర్యటనలో భాగంగా కరువా జిల్లాలో 2019లో అమరుడైన బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వినయ్ ప్రసాద్‌కు అమిత్ షా నివాళులర్పించారు. బీఎస్ఎఫ్ సిబ్బంది త్యాగాలు, శౌర్య పరాక్రమాలను ప్రశంసించారు. "దేశ భద్రత విషయానికి వస్తే బీఎస్ఎఫ్‌కు ఘన చరిత్ర ఉంది. విపత్కర వాతావరణ పరిస్థితులు, భౌగోళిక సవాళ్లను ఎదుర్కొంటూ అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిస్తారు. భద్రతా బలగాలు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే స్థానికంగా రూ.47 కోట్లతో నిర్మించిన మౌలిక సదుపాయాలను ప్రారంభించారు.

# రెండు లక్షల మంది ఏఐ ఇంజినీర్లను తయారు చేయాలన్నదే లక్ష్యం: మంత్రి

హైదరాబాద్: తెలంగాణ నుంచి రెండు లక్షల మంది ఏఐ ఇంజినీర్లను తయారు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కాన్సులేట్ జనరల్ ఆఫ్ సింగపూర్ ఎడ్గర్ పాంగ్ నేతృత్వంలో ఆ దేశ ప్రతినిధులు సోమవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. 'ఎమర్జింగ్ టెక్నాలజీస్' కు




హబ్‌గా తెలంగాణను మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా శ్రీధర్ బాబు వారికి వివరించారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతను తీర్చిదిద్దుతామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నెలకొల్పుతున్న ఫ్యూచర్ సిటీ, యంగ్ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ గురించి వివరించారు. "ఫ్యూచర్ సిటీలో భాగస్వామ్యమయ్యేందుకు అనేక అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చాయి. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ)కు హబ్‌గా హైదరాబాద్ మారుతుంది. ఏడాది వ్యవధిలోనే ఐటీ, హాస్పిటాలిటీ, ఇతర రంగాలకు చెందిన 70 జీసీసీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పరిశ్రమల ఏర్పాటును ఒక్క హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా.. వరంగల్, కరీంనగర్ లాంటి నగరాలకు విస్తరించేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నాం" అని శ్రీధర్‌బాబు వివరించారు. టెక్నాలజీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఇతర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

## హెచ్‌సీయూ విద్యార్థులపై కేసులను వెంటనే ఉపసంహరించండి: భట్టి



హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పోలీసులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో హెచ్‌సీయూ టీచర్స్ అసోసియేషన్, సివిల్ సొసైటీ గ్రూప్స్‌తో, సబ్ కమిటీ సభ్యులైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటితో చర్చించిన అనంతరం భట్టి ఈ నిర్ణయం తీసుకున్నారు. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఇద్దరు విద్యార్థులకు సంబంధించి కేసుల ఉపసంహరణకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ అధికారులకు తగు సూచనలు చేయాల్సిందిగా న్యాయశాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు.

## కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై హైకోర్టులో ప్రభుత్వం పిటిషన్

హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కృత్రిమమేధ సాయంతో నకిలీ వీడియోలు సృష్టించి ప్రచారం చేశారని పిటిషన్‌లో పేర్కొంది. ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టు న్యాయవాది మేనక గురుస్వామి వాదనలు వినిపించారు. మొత్తం 400 ఎకరాలకు సంబంధించిన నకిలీ వీడియోలు, ఆడియో క్లిప్పింగ్స్ తయారు చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. భూమిని చదును చేసే క్రమంలో



బుల్డోజర్లను చూసి జింకలు, నెమళ్లు పారిపోతున్నట్లు నకిలీ వీడియోలు సృష్టించారని పిటిషన్‌లో పేర్కొంది. నకిలీ వీడియోలు సృష్టించిన వారిపై తగిన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని ప్రభుత్వం న్యాయస్థానాన్ని కోరింది. పిటిషన్‌పై ఏప్రిల్ 24న వాదనలు వింటామని హైకోర్టు వెల్లడించింది.

## దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసుపై ఏప్రిల్ 8న తీర్పు

హైదరాబాద్: దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో మంగళవారం (ఏప్రిల్ 8) తెలంగాణ హైకోర్టు తీర్పు ఇవ్వనుంది. 2013లో జరిగిన పేలుళ్లలో 18 మంది మృతి చెందగా.. 130 మందికి గాయాలయ్యాయి. ఈ కేసులో



ప్రధాన నిందితుడు యాసిన్ బత్కల్ సహా ఐదుగురికి 2016లో ఎన్ఐఏ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఉరిశిక్ష విధించింది. దీనిపై ముద్దాయిలు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం మంగళవారం తీర్పు వెలువరించనుంది.




## మే 6 అర్ధరాత్రి నుంచి తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మె

హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగనుంది. మే 6 అర్ధరాత్రి నుంచి సమ్మె చేయాలని ఆర్టీసీ జేఏసీ నిర్ణయించింది. ఈ మేరకు సంస్థ ఎండీ సజ్జనార్, లేబర్ కమిషనర్‌కు ఆర్టీసీ జేఏసీ నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. మే 7వ తేదీ మొదటి డ్యూటీ నుంచి విధులు బహిష్కరిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇవాళ్టి వరకు ఆర్టీసీ ఉద్యోగులకు జీతాలు పడలేదని నోటీసుల్లో పేర్కొన్నారు.

## 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీజేపీకి రూ. 2,243 కోట్ల విరాళాలు: ఏడీఆర్

* **అన్ని పార్టీలకు వచ్చిన విరాళాలు రూ. 2,544 కోట్లు**
* **ఒక్క బీజేపీకే 88 శాతం విరాళాలు**
* **రూ. 281 కోట్లతో రెండో స్థానంలో కాంగ్రెస్**

2023..24 ఆర్థిక సంవత్సరానికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రూ. 2,243 కోట్ల విరాళాలు స్వీకరించింది. అసోసియేటెడ్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) జాతీయ పార్టీలు ఆ ఆర్థిక సంవత్సరంలో పొందిన విరాళాల



వివరాలను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అత్యధిక విరాళాలు పొందిన పార్టీగా నిలిచింది. అన్ని జాతీయ పార్టీలకు కలిపి మొత్తం రూ. 2,544.28 కోట్ల విరాళాలు అందాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తం రూ. 12,547 కోట్లుగా నమోదైంది. 202324 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన విరాళాలలో బీజేపీ వాటా 88 శాతంగా ఉంది. రూ. 281 కోట్ల విరాళాలతో కాంగ్రెస్ పార్టీ రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీ, సీపీఎం, నేషనల్ పీపుల్స్ పార్టీలు ఉన్నాయి. తమకు ఎలాంటి విరాళాలు అందలేదని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ప్రకటించింది.



## సామాన్యులకు షాక్... భారీగా గ్యాస్ ధరల పెంపు!

* **వంట గ్యాస్ సిలిండర్‌పై రూ. 50 పెంచిన కేంద్రం**
* **ఈ మేరకు కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి ప్రకటన**
* **ఉజ్వల పథక లబ్ధిదారులు, జనరల్ కేటగిరీ వినియోగదారులు ఇద్దరికీ ఈ ధరలు వర్తింపు**
* **రేపటి నుంచే కొత్త ధరలు అమల్లోకి**

వంట గ్యాస్ ధరను పంపిణీ సంస్థలు సిలిండర్‌కు రూ.50 పెంచాయని కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి సోమవారం వెల్లడించారు. జనరల్ కేటగిరీ వినియోగదారులతో పాటు ఉజ్వల పథక లబ్ధిదారులకు కూడా ఈ పెంపు వర్తిస్తుందన్నారు. రేపటి నుంచే కొత్త ధరలు అమల్లోకి వస్తాయని మంత్రి తెలిపారు. ఈ పెంపుతో 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధర సాధారణ వినియోగదారులకు రూ. 803 నుంచి రూ. 853కు, ఉజ్వల్ సిలిండర్ రూ. 503 నుంచి రూ. 553కు చేరనుంది. అటు... పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ. 2 చొప్పున ఎక్సైజ్ డ్యూటీని పెంచగా, ఆ భారాన్ని చమురు కంపెనీలే భరించనున్నాయి.

## అవును, నేను కేసీఆర్‌కు విశ్వాసమైన కుక్కలా ఉంటాను

**: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

* **కడియం శ్రీహరిలా తాను గుంట నక్కను మాత్రం కాదన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి**
* **బీఆర్ఎస్ పార్టీ దయతో గెలిచి కాంగ్రెస్‌లో చేరిన గుంట నక్క అని కడియంపై విమర్శ**
* **తనను గెలిపించిన వారిని కాపాడుకోవడానికి కాపలా కుక్కలా పని చేస్తానని వెల్లడి**

"అవును, నేను కుక్కనే. నన్ను నమ్మిన కేసీఆర్ కు విశ్వాసమైన కుక్కలా ఉంటాను. కానీ ఒక పార్టీలో గెలిచి అధికారం కోసం మరో పార్టీలోకి దూకే కడియం శ్రీహరి లాంటి గుంట నక్కను మాత్రం కాదు" అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీ దయతో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన గుంట నక్క అని ఆయన మండిపడ్డారు. తన మీద నమ్మకం ఉంచి తనను గెలిపించిన ప్రజలు, నాయకులను కాపాడుకోవడానికి కాపలా కుక్కలా పనిచేస్తానని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్



తాను ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, ఈ విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. ప్రజల భూములను కాపాడటంలో రేచు కుక్కలా ఉండి పోరాడతానని ఆయన స్పష్టం చేశారు.

## భారాస నేత మన్నె క్రిశాంక్‌కు గచ్చిబౌలి పోలీసుల నోటీసులు




హైదరాబాద్: భారాస నేత మన్నె క్రిశాంక్‌కు గచ్చిబౌలి పోలీసులు నోటీసులు జారీ చేశారు. కంచ గచ్చిబౌలి భూముల అంశంలో ఏఐ ఉపయోగించి సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు చేసినందుకు నోటీసులు ఇచ్చారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో గచ్చిబౌలి పీఎస్‌కు విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు.

# సామాన్యులకు షాక్..

## గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంపు..



**న్యూఢిల్లీ:** సామాన్యులకు చమురు కంపెనీలు షాక్ ఇచ్చాయి. ఓ వైపు ధరల పెరుగుదలతో ఇబ్బందిపడుతున్న జనం నెత్తిన మరోసారి భారం మోపాయి. గృహ వినియోగ సిలిండర్ ధరను పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ఒకేసారి రూ.50 ధరను పెంచాయి. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ సోమవారం ఎల్‌పీజీ ధరలను రూ.50 పెంచుతున్నట్లు ప్రకటించారు. ఉజ్వల, సాధారణ కేటగిరీ వినియోగదారులకు గ్యాస్ ధరను పెంచినట్లు మంత్రి ప్రకటించారు. దాంతో 14.2 కేజీల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.803 నుంచి రూ.853కి పెరగనున్నది. ఇక ఉజ్వల యోజన పథకం లబ్ధిదారులకు 14.2 కేజీల సిలిండర్ ధర రూ.503 నుంచి రూ.553కి చేరనున్నది. పెరిగిన సిలిండర్ ధరలు మంగళవారం నుంచి అమలులోకి రానున్నాయి.

ఇదిలా ఉండగా.. కేంద్రం లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ.2 ఎక్సైజ్ డ్యూటీని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ధరల్లో ఎలాంటి మార్పులు ఉండవని పేర్కొంది. ఎక్సైజ్ డ్యూటీ పెరుగుదలతో పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరల్లో.. పెరుగుదల ఉండదని చమురు మార్కెటింగ్ కంపెనీలు సమాచారం ఇచ్చినట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వశాఖ సోషల్ మీడియా వేదికగా తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలను ప్రకటించిన నేపథ్యంలో ప్రపంచ మార్కెట్‌లో వాణిజ్య యుద్ధం భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా పతనమ్యాయి. ఈ క్రమంలో కేంద్రం సెంట్రల్ ఎక్సైజ్ సుంకాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గిన నేపథ్యంలో అదనపు భారాన్ని కంపెనీలు సర్దుబాటు చేసుకుంటాయని భావిస్తున్నారు.

# కుప్పకూలిన భారత స్టాక్ మార్కెట్లు..

## 2020 తర్వాత తొలిసారి భారీగా పతనమైన నిఫ్టీ



**ముంబై:** భారత స్టాక్ మార్కెట్లు సోమవారం కుప్పకూలాయి. ప్రపంచ మార్కెట్‌లో ప్రతికూల పవనాల నేపథ్యంలో మార్కెట్లు కుదేలయ్యాయి. ట్రంప్ ప్రతీకార సుంకాలపై చైనా సైతం పన్నులు ప్రకటించింది. ప్రపంచ వాణిజ్య యుద్ధం తప్పదనే సంకేతాల మధ్య భయాందోళనలు పెరిగాయి. దానికి తోడు అమెరికాలో మాంద్యం భయాలు ఎక్కువయ్యాయి. దాంతో పెట్టుబడిదారుల సెంటిమెంట్ దెబ్బతిన్నది. ఫలితంగా మార్కెట్‌లో భారీగా అమ్మకాలు జరిగాయి. సెన్సెక్స్ మూడుశాతానికిపైగా నష్టపోయింది. సెన్సెక్స్. నిఫ్టీ దాదాపు పదినెలల కనిష్ఠానికి చేరాయి. నిఫ్టీలో లిస్టయిన కంపెనీల విలువ రూ.20లక్షల కోట్ల వరకు పతనమైంది. క్రితం సెషన్ (శుక్రవారం ముగింపు 75,364.69) తో పోలిస్తే సెన్సెక్స్ 71,449.94 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ దాదాపు 4వేల పాయింట్ల దాకా పతనమైంది. కేవలం పది సెకన్లలోనే మార్కెట్‌లో రూ.18లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరైంది. ఇంట్రాడేలో 73,403.99 పాయింట్ల గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. అత్యల్పంగా 71,425.01 పాయింట్ల కనిష్ఠానికి చేరుకుంది.

చివరకు 2,226.79 పాయింట్ల నష్టంతో 73,137.90 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇదే బాటలో కొనసాగింది. ప్రారంభంలోనే వెయ్యి పాయింట్లకుపైగా పతనమైంది. చివరకు 742.85 పాయింట్ల నష్టంతో 22,161.60 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు పది నెలల తర్వాత కనిష్ఠానికి చేరుకున్నాయి. ముఖ్యంగా నిఫ్టీ 2020 మార్చి తర్వాత భారీగా పతనమైంది. మార్కెట్‌లో దాదాపు 559 షేర్లు పురోగమించగా, 3,372 షేర్లు కుప్పకూలాయి. నిఫ్టీ అత్యధికంగా ట్రెంట్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హిందాల్కో ఇండస్ట్రీస్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్ లాభపడింది. ఇక మార్కెట్‌లో మెటల్ ఇండెక్స్ 6.7 శాతం, రియల్టీ ఇండెక్స్ 5.6 శాతం, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, ఆటో, ఎనర్జీ, ఐటీ 2.5 నుంచి 4 శాతం తగ్గడంతో అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 3.4 శాతం నుంచి 4 శాతం చొప్పున తగ్గాయి. మరో వైపు ఆసియా మార్కెట్లు సైతం భారీ నష్టాల్లో కొనసాగాయి. 2008 తర్వాత ఆసియా మార్కెట్లు భారీగా నష్టపోయాయి. మాంద్యం భయాలు మెటల్ కంపెనీల షేర్లు భారీగా నష్టాలను చవిచూశాయి.

# పెట్రోల్ ధరలో ఎలాంటి మార్పు ఉండదు..

## క్లారిటీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం



**న్యూఢిల్లీ:** పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని రూ.2 పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. దీంతో పెట్రోల్ ధరలు పెరుగుతాయని వాహనదారులు భావించారు. అయితే ఈ ఎక్సైజ్ డ్యూటీ పెంపు భారం సామాన్యులపై ఉండబోదని కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది.

ఎక్సైజ్ సుంకం పెంపును ఆయిల్ కంపెనీలే భరిస్తాయని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. సామాన్యులకు పెట్రోల్ ధరలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేసింది. ఈ మేరకు పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ట్విట్టర్(ఎక్స్) వేదికగా క్లారిటీ ఇచ్చింది. మరోవైపు అమెరికా -చైనా ట్రేడ్ వార్, ఆర్థిక మాంద్యం భయాలు, ఒపెక్ ప్లస్ ఉత్పత్తి పెంపు వంటి అంతర్జాతీయ ఆర్థిక భయాల నేపథ్యంలో కొంతకాలంగా క్రూడాయిల్ ధరలు భారీగా పతనం అవుతున్నాయి. వారం వ్యవధిలోనే సుమారు 10 డాలర్ల వరకు తగ్గి.. ఇప్పుడు మూడేళ్ల కనిష్ట సాయికి చేరింది. అయినప్పటికీ దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి తగ్గింపు జరగలేదు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల తగ్గింపు నేపథ్యంలో ఇప్పటికైనా పెట్రోల్ ధరలు తగ్గుతాయేమోనని ఎదురుచూస్తున్న సామాన్యులపై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ పెంపు పేరుతో షాకిచ్చింది.

# పదేళ్ల తర్వాత ఆర్సీబీ విక్టరీ

## తమ్మున్ని ఓడించిన అన్న.. ఓ మై పాండ్యా..!

**ముంబై:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మూడో విజయాన్ని నమోదు చేసింది. సోమవారం వాంఖడే వేదికగా జరిగిన మ్యాచులో ముంబై ఇండియన్స్‌ను 12 పరుగుల తేడాతో ఓడించింది. చివరి ఓవర్ వరకూ ఉత్కంఠ భరితంగా సాగిన ఈ మ్యాచులో ఆర్సీబీ గెలుపు గీతను దాటింది. పదేళ్ల తర్వాత వాంఖడే స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. ముంబై ఇండియన్స్‌ను ఓడించింది.

ఈ మ్యాచులో టాస్ గెలిచిన ముంబై కెప్టెన్ హార్దిక్..







ఆర్సీబీని బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. దేవ్‌దత్ పడిక్కల్ (22 బంతుల్లో 37 రన్స్), విరాట్ కోహ్లీ (42 బంతుల్లో 67 రన్స్), కెప్టెన్ రజత్ పాటీదార్ (32 బంతుల్లో 64 రన్స్ ), జితేశ్ శర్మ (19 బంతుల్లో 40 రన్స్) చేయడంతో ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 221 రన్స్ స్కోరు చేసింది. ముంబై ఇండియన్స్ బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ 2, హార్దిక్ పాండ్యా 2, విగ్నేష్ పథుర్ ఒక వికెట్ తీశారు.

అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్.. ధాటిగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. ఉన్నంత సేపు అలరించిన రోహిత్ శర్మ (9 బంతుల్లో 17 రన్స్.. 2 ఫోర్లు, 1 సిక్స్) త్వరగానే ఔట్ అయ్యాడు. అయితే పరుగులు చేసేందుకు విల్ జాక్స్ (18 బంతుల్లో 22 రన్స్), సూర్యకుమార్ యాదవ్ (26 బంతుల్లో 28 రన్స్) తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. దీంతో ముంబై రన్ ఛేజ్‌లో వెనకబడింది.

ఈ దశలో తిలక్ వర్మ (29 బంతుల్లో 56 రన్స్), హార్దిక్ పాండ్యా (15 బంతుల్లో 42 రన్స్) మ్యాచును మలుపు తిప్పారు. మ్యాచును చివరి ఓవర్ వరకూ తీసుకెళ్లారు. చివరి రెండు ఓవర్లలో 28 పరుగులు అవసరమైన దశలో.. హేజిల్‌వుడ్ అదరగొట్టాడు. 19వ ఓవర్‌లో హార్దిక్ పాండ్యాను ఔట్ చేయడంతో పాటు 9 పరుగులు మాత్రమే ఇచ్చాడు. చివరి ఓవర్‌లో కృనాల్ పాండ్యా.. 3 వికెట్లు పడగొట్టి.. ఆరు రన్స్ మాత్రమే ఇచ్చాడు. దీంతో ఆర్సీబీ 12 పరుగుల తేడాతో విజయం సాధించింది. టోర్నీలో మూడో విజయాన్ని నమోదు చేసింది.

## ఏటీపీ టోర్నీలో విజయం..

# చరిత్ర సృష్టించిన బోపన్న



**న్యూఢిల్లీ:** భారత టెన్నిస్ దిగ్గజం రోహన్ బోపన్న చరిత్ర సృష్టించాడు. నలభై ఏళ్లు దాటినా.. ఉరకలేసే ఉత్సాహంతో ప్రత్యర్థులను చిత్తు చేస్తున్న బోపన్న తాజాగా ఏటీపీ మాస్టర్స్ 1000 టోర్నమెంట్‌లో అదరగొట్టాడు. డబుల్స్‌లో అద్భుత విజయం సాధించి.. ఈ టోర్నీలో ఒక మ్యాచ్ గెలుపొందిన అతి పెద్ద వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడీ టెన్నిస్ లెజెండ్. తద్వారా 45 ఏళ్లున్న బోపన్న కెనడాకు చెందిన డానియెల్ నెస్టర్‌ను అధిగమించాడు. 2017లో మాడ్రిడ్ మాస్టర్స్‌లో గెలుపొందే నాటికి డానియెల్ వయసు.. 44 ఏళ్ల 8 నెలలు.

మొనాకో వేదికగా జరుగుతున్న మాంటే కార్లో మాస్టర్స్‌లో బోపన్న అమెరికాకు చెందిన బెన్ షెల్టన్‌తో కలిసి బరిలోకి దిగాడు. రౌండ్ 32లో భాగంగా ఫ్రాన్సిస్కో సెరుండొలో, అలెజండ్రో తబిలో జంటతో తలపడింది బోపన్న ద్వయం. ప్రత్యర్థికి ముచ్చెమటలు పట్టించిన ఈ జోడీ.. 71 నిమిషాల్లోనే 6-3, 7-5తో చిత్తు చేసింది. ప్రస్తుతం బోపన్న, షెల్టన్ జోడీ ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 14వ స్థానంలో కొనసాగుతోంది.

### ర్యాంకింగ్స్‌లో నంబర్ 1

వయసు పైబడుతున్న కొద్ది రాటుదేలుతున్న ఆటగాళ్లలో బోపన్న ఒకరు. 2024 సీజన్‌లో మాథ్యూ ఎబ్డెన్ జతగా డబుల్స్‌లో చెలరేగి ఆడిన అతడు ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ గెలుపొందాడు. దాంతో, ఆ ఏడాది ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానం సాధించాడు బోపన్న. ఫలితంగా.. అతి పెద్ద వయసులో అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్న ఆటగాడిగా రికార్డు సృష్టించాడు బోపన్న. ప్రస్తుతం 45 ఏళ్లు ఉన్న ఈ స్టార్ ప్లేయర్ ఈ ఏడాది వీడ్కోలు పలికే అవకాశముంది.

## రెండేళ్ల నిషేధం తర్వాత మైదానంలోకి..

# ఎవరీ నాసీర్ హుస్సేన్..!



**న్యూఢిల్లీ:** అవినీతి కేసులో రెండేళ్ల నిషేధానికి గురైన క్రికెటర్ నాసీర్ హుస్సేన్ మళ్లీ మైదానంలో అడుగు పెట్టనున్నాడు. సస్పెన్షన్ ముగియడంతో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ అతడికి పునరాగమనానికి మార్గం సుమగం చేసింది. దాంతో, బంగ్లాదేశ్‌కు చెందిన 33 ఏళ్ల హుసేన్ ఫ్రాంచైజీ క్రికెట్‌లో సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. క్రికెట్‌లో అవినీతికి నిరోధక విభాగం నియమ నిబంధనలను ఉల్లఘించినందుకు 2023 సెప్టెంబర్‌లో హుసేన్‌పై 6 నెలల నిషేధం విధించింది ఐసీసీ.

హుసేన్ తనకు బహుమతిగా లభించిన ఐఫోన్ 12 గురించి ఐసీసీ అవినీతి నిరోధక విభాగం అధికారులకు సమాచారం ఇవ్వలేదు. అసలు, ఆ గిఫ్ట్ అతడికి ఎవరు ఇచ్చారు? బదులుగా ఏమి ఆశించారు? అనే విషయాలు వెల్లడించలేదు. వీటితో పాటు విచారణ సమయంలో అధికారులకు సహకరించలేదు అనే అభియోగంతో హుసేన్‌పై రెండేళ్ల నిషేధం విధించింది ఐసీసీ. ఆ నిషేధాన్ని రెండేళ్లకు పొడిగించింది. అప్పటి నుంచి ఈ ఆల్‌రౌండర్ ఆటకు దూరమయ్యాడు.

'ఐసీసీ విధించిన ఆంక్షలు, నిషేధం ముగియడంతో హుసేన్ ఇప్పుడు క్రికెట్ ఆడేందుకు అన్నివిధాలా అర్హత సాధించాడు. అతడికి అవినీతి నిర్మూలనకు సంబంధించిన క్లాసులకు అతడు హాజరవుతాడు. ఫలితంగా ఏప్రిల్ 7వ తేదీ నుంచి అతడు మళ్లీ క్రికెటర్‌గా తన ప్రయాణాన్ని కొనసాగించనున్నాడు' అని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది.

115 అంతర్జాతీయ మ్యాచ్‌లు

దేశవాళీలో బ్యాటుతో, బంతితో రాణించిన హుసేన్ 2011లో అరంగేట్రం చేశాడు. మూడు ఫార్మట్లలో కీలక ఆటగాడిగా ఎదిగాడు. 2018 వరకూ అంటే.. ఏడేళ్ల కాలంలో అతడు దేశం తరఫున 115 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. 19 టెస్టులు, 65 వన్డేలు, 31 టీ20లు ఆడాడు. ప్రస్తుతం స్వదేశంలో జరుగుతున్న బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో రూప్‌గంజ్ టైగర్స్ ఆటగాడిగా అతడు బరిలోకి దిగనున్నాడు.

# ఇంగ్లండ్ వన్డే జట్టు కెప్టెన్‌గా హ్యారీ బ్రూక్

**లండన్:** ఇంగ్లండ్ వన్డే జట్టు కెప్టెన్‌గా హ్యారీ బ్రూక్‌ను ఎంపిక చేశారు. హ్యారీ బ్రూక్‌కు జట్టు సారథ్య బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఇటీవల జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో ఇంగ్లండ్ జట్టు పేలవ ప్రదర్శన చేసింది. అందుకు బాధ్యత వహిస్తూ జాస్ బట్లర్ తన కెప్టెన్సీకి రాజీనామా చేశాడు. బట్లర్ స్థానంలో ఇప్పుడు నూతన కెప్టెన్‌గా బ్రూక్‌ను ఎంపిక చేశారు.



ఛాంపియన్స్ ట్రోఫీలో వరుసగా ఆస్ట్రేలియాతో, ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన రెండు మ్యాచ్‌లలో ఇంగ్లండ్ ఓడింది. దాంతో ఇంగ్లండ్ సెమీస్ ద్వారాలు మూసుకుపోయాయి. వర్క్‌లోడ్ పేరుతో హ్యారీ బ్రూక్ 2025 ఐపీఎల్ సీజన్ నుంచి తప్పుకున్నాడు. దాంతో అతనిపై ఐపీఎల్‌లో ఆడకుండా రెండేళ్ల నిషేధం పడింది. 2022 జనవరిలో జట్టులోకి వచ్చింది మొదలు హ్యారీ బ్రూక్, వన్డే, టీ20 మ్యాచ్‌లలో సత్తా చాటుతున్నాడు.

టెస్టు క్రికెట్‌లో కూడా బ్రూక్ అద్భుతంగా ఆడుతున్నాడు. ప్రస్తుతం టెస్టు క్రికెట్‌కు సంబంధించి ఐసీసీ వరల్డ్ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో బ్రూక్ రెండో స్థానంలో ఉన్నాడు. 26 ఏళ్ల బ్రూక్ ఏడాది కాలంగా వన్డే, టీ20 మ్యాచ్‌లలో ఇంగ్లండ్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా కూడా వ్యవహరిస్తున్నాడు. గత సెప్టెంబర్‌లో బట్లర్ అందుబాటులో లేకపోవడంతో ఆస్ట్రేలియాతో సిరీస్‌కు కెప్టెన్‌గా కూడా బ్రూక్ వ్యవహరించాడు.



# ఇండస్ట్రీలోకి రావడానికి తెలుగు అమ్మాయిలు భయపడుతున్నారు : వైష్ణవి చైతన్య

**టాకీస్:** షార్ట్ ఫిల్మ్ లతో కెరీర్ మొదలు పెట్టి, వెబ్ సిరీస్ లతో పాప్యులర్ అయిన అచ్చ తెలుగు అమ్మాయి వైష్ణవి చైతన్య.. తొలి సినిమా 'బేబి'తో స్టార్ అయిపోయింది. ప్రస్తుతం హీరో సిద్దూ జొన్నలగడ్డ సరసన 'జాక్' మూవీలో నటిస్తోంది. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్స్, టీజర్, ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ లో వైష్ణవి చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. టాలీవుడ్ లో తెలుగు అమ్మాయిలకు అవకాశాలు రావు అనే ప్రచారం ఎందుకు జరిగిందో కానీ.. ఆ ప్రచారం వల్లే చాలా మంది అమ్మాయిలు ఇండస్ట్రీకి రావాలనే ఆలోచన చేయడం లేదని వైష్ణవి చెప్పింది. ఇండస్ట్రీలోకి రావాలనే ప్రయత్నమే చేయకపోతే ఎలాగని ప్రశ్నించింది. ఓపికతో ప్రయత్నిస్తే అవకాశాలు వస్తాయని... దానికి తానే ఉదాహరణ అని చెప్పింది. అవకాశాలు రావు అని భయపడి ఆగిపోయే బదులు గట్టిగా ప్రయత్నిస్తే అవకాశాలు మీ తలుపు తడతాయని... ఇండస్ట్రీలోకి రావాలనుకునేవారికి ఇదే తానిచ్చే సలహా అని చెప్పారు.

## ఇద్దరు బిడ్డల తల్లయినా తరగని అందం.. ఫ్యాషన్ షోలో ప్రణీత ధగధగలు

**టాకీస్:** అందం, అభినయం దండిగా ఉన్నప్పటికీ స్టార్ హీరోయిన్ అనిపించుకోలేకపోయారు కన్నడ కస్తూరి ప్రణీత సుభాష్. అవకాశాలు తగ్గిపోవడంతో పెళ్లి చేసుకుని వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నారు ప్రణీత. అయినప్పటికీ సోషల్ మీడియాలో హాట్ హాట్ ఫోటో షూట్‌తో రెచ్చిపోతుంటారు. సూపర్‌స్టార్ మహేశ్ బాబు బ్లాక్‌బస్టర్ మూవీ పోకిరికి కన్నడ వెర్షన్ పోర్కీతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు ప్రణీతా సుభాష్. సిద్ధార్థ్ హీరోగా వచ్చిన బావతో తెలుగు వారిని పలకరించింది. కలువ కళ్లు, వైట్ స్కిన్ టోన్‌తో కుర్రాళ్లకి తొలి చిత్రంతోనే గిలిగింతలు పెట్టారు ప్రణీత. స్టార్ హీరోయిన్ అవుతుందని అనుకుంటే ఎందుకో ప్రణీతకు సెకండ్ లీడ్‌గానే అవకాశాలు వచ్చాయి. అత్తారింటికి దారేది, పాండవులు పాండవులు తుమ్మెద, బ్రహ్మోత్సవం, హలో గురు ప్రేమ కోసమే వంటి చిత్రాలు ప్రణీతకు మంచి పేరు తీసుకొచ్చాయి. తెలుగు, తమిళంతో పాటు హిందీలో హంగామా-2లో నటించారు. కరోనా లాక్‌డౌన్ సమయంలోనే బెంగళూరుకు చెందిన వ్యాపారవేత్త నితిన్ రాజును ప్రణీత పెళ్లాడి ఇండస్ట్రీని , అభిమానులను ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఆ తర్వాత కొద్దిరోజులకే ప్రెగ్నెంట్ అంటూ శుభవార్త చెప్పారు. 2022 జూన్ 11న పండంటి ఆడబిడ్డకు ప్రణీత జన్మనిచ్చారు.. ఆ బిడ్డను చూసుకుంటూనే సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టిన సమయంలో మరోసారి గర్భం దాల్చారు ప్రణీత. గతేడాది సెప్టెంబర్ 5న పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు ప్రణీతా సుభాష్. ఇద్దరు బిడ్డల తల్లి అయినా తరగని అందంతో రెచ్చగొడుతున్నారు ఈ ముద్దుగుమ్మ.




## హిట్ కోసం అఖిల్ ఎదురుచూపు



**టాకీస్:** టాలీవుడ్ స్టార్ కిడ్స్‌లో సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న వారిలో టాప్‌లో ఉంటాడు అక్కినేని అఖిల్. వివి వినాయక్ డైరెక్షన్‌లో 'అఖిల్' సినిమాతో లీడ్ యాక్టర్‌గా డెబ్యూ ఇచ్చిన ఈ అక్కినేని యాక్టర్ ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయాడు. 2023లో వచ్చిన ఏజెంట్ బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టడంతో ఈ సారి సరికొత్త ప్రయత్నంతో సక్సెస్ కొట్టాలనే కసితో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు అఖిల్. తాజాగా అఖిల్ 6 ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. ప్రేమ కంటే హింసాత్మకమైన యుద్ధం మరొకటి లేదు.. అంటూ పిడికిల్ బిగించిన లుక్ ఒకటి రిలీజ్ చేశారు మేకర్స్. టైటిల్ గ్లింప్స్‌ను ఏప్రిల్ 8న విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. అఖిల్ చేతి మణికట్టుపై ఖడ్గంతో డిజైన్ చేసిన కడెంను చూడొచ్చు. అఖిల్ ఈ సారి ఏదో గట్టి ప్లాన్‌తోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. వినరో భాగ్యము విష్ణు కథ ఫేం మురళీ కిశోర్ అబ్బూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఎస్ థమన్ సంగీతం అందిస్తున్న ఈ మూవీకి సంబంధించి పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు మేకర్స్.

## ఒమన్‌లో విజయ్, రష్మిక ఎంజాయ్
### మరోసారి నెట్టింట ఫోటోలు చక్కర్లు

**టాకీస్:** గత కొద్ది రోజులుగా విజయ్ దేవరకొండ-రష్మికల రిలేషన్ షిప్ గురించి ఎన్నో వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. కాని దానికి వారు సరైన క్లారిటీ ఇవ్వడం లేదు. ఓ రకంగా దోబూచులాడుతున్నారు. ఫెస్టివల్స్ ని కలిసే సెలబ్రేట్ చేసుకుంటున్నారు. వెకేషన్స్‌కి కలిసే వెళుతున్నారు. ఇద్దరిలో ఎవరి బర్త్ డే అయిన కూడా ఏదో వెకేషన్‌కి వెళ్లి అక్కడే కలిసి చేసుకుంటున్నారు. అయితే ఏప్రిల్ 5న రష్మిక బర్త్ డే కాగా, ఆమె తన బర్త్ డే సెలబ్రేషన్స్ కోసం ఒమన్ వెళ్లారు. అక్కడ దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేయగానే చాలా మంది 'విజయ్ దేవరకొండ ఎక్కడ?' అంటూ



కామెంట్ చేశారు. అయితే విజయ్ దేవరకొండ తన సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలు షేర్ చేయడంతో ఇద్దరు కలిసే ఉన్నారనే చర్చ మొదలైంది. విజయ్ దేవరకొండ అండ్ రష్మిక ఇద్దరు విడివిడిగా ఒమన్ వెళ్లినట్టు తెలుస్తుంది. రష్మిక కంటే ఒక్క రోజు ముందు ముంబై నుంచి విజయ్ దేవరకొండ ఒమన్‌కి బయలుదేరాడు. ఆ తర్వాత రోజు నేషనల్ క్రష్ రష్మిక వెళ్ళింది. ఇద్దరు ఒకే చోటకు వెళ్లారనే సంగతి ఆడియన్స్ అందరికీ అర్థమవుతుంది. మొదట రష్మిక మందన్నా పంచుకున్న ఫోటోలలో ఆమె సముద్రపు ఒడ్డున బోట్‌లో విందు ఆరగిస్తుంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ సముద్ర తీరంలో గుర్రపు స్వారీ చేస్తున్న ఫోటోలను, నడుస్తున్న ఫోటోలను విడుదల చేశారు. అవి చూసాక ఇద్దరు ఒకే చోట ఉన్నారని నెటిజన్స్ భావిస్తున్నారు. తమ ప్రేమ గురించి విజయ్ దేవరకొండ ఇలా క్లూ ఇచ్చాడని, వీలైనంత తొందరలోనే వారి రిలేషన్ షిప్‌కి సంబంధించి పూర్తి క్లారిటీ అయితే వస్తుందని నెటిజన్స్ అంటున్నారు. సినిమాల విషయానికి వస్తే విజయ్ దేవరకొండ హీరోగా జెర్సీ మళ్ళీరావా సినిమాల ఫేమ్ గౌతమ్ తిన్ననూరి కాంబోలో 'కింగ్‌డమ్ చిత్రం రూపొందుతుంది. కొద్ది రోజుల క్రితం సినిమాకి సంబంధించిన టీజర్ విడుదల కాగా, ఇది సెన్సేషన్ క్రియేట్ చేసింది.




## బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్న తెలుగు భామ!

టాకీస్: టాలీవుడ్ ఇండస్ట్రీలో తెలుగు అమ్మాయిలు హీరోయిన్లుగా రాణించే పరిస్థితులు అంతగా లేని ఈ రోజుల్లో, అచ్చమైన తెలుగమ్మాయి అనన్య నాగళ్ల మాత్రం తన సత్తా చాటుతున్నారు. టాలీవుడ్‌లో మంచి డిమాండ్ ఉన్న హీరోయిన్ల జాబితాలో ఆమె స్థానం సంపాదించారు. 'మల్లేశం' సినిమాతో సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన అనన్య, పవన్ కల్యాణ్ నటించిన వకీల్ సాబ్ మూవీలో నటించే అవకాశం దక్కించుకున్నారు. ఈ సినిమాలో నటించిన తర్వాత మంచి గుర్తింపు అందుకున్న ఆమె, తంత్ర, పొట్టేల్, బహిష్కరణ (వెబ్ సిరీస్), శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ వంటి మూవీల్లో విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను మరింత ఆకట్టుకున్నారు. రూ.5 కోట్ల లోపు బడ్జెట్‌తో రూపొందించే లేడీ ఓరియెంటెడ్ మూవీ నిర్మాతలకు అనన్య బెస్ట్ ఆప్షన్ అయిపోయారు. ఇదిలా ఉంటే, ఈ తెలుగమ్మాయి అనన్య ఇప్పుడు బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఓ హిందీ ప్రాజెక్టులో, అది కూడా లీడ్ పాత్రలో అనన్య ఎంపికైనట్లు తెలుస్తోంది.

## ముంబైలో ఓదెల-2 హంగామా




**టాకీస్:** నాగసాధువుగా తమన్నా భాటియా నటించిన సూపర్ నాచురల్ పాన్ ఇండియా థ్రిల్లర్ 'ఓదెల 2'. ఓటీటీ హిట్ 'ఓదెల రైల్వేస్టేషన్'కి ఇది సీక్వెల్. అశోక్‌తేజ దర్శకుడు. డి.మధు నిర్మాత. సంపత్ నంది దర్శకత్వ పర్యవేక్షణలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ని ఈ నెల 8న ముంబయ్‌లో జరిగే ఓ ఈవెంట్‌లో గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నారు. ఈ విషయాన్ని ఆదివారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలిపారు. 'ఈ సినిమా ప్రారంభోత్సవం కాశీలో చేశాం. టీజర్‌ను కుంభమేళాలో విడుదల చేశాం. ట్రైలర్‌ని ముంబయ్‌లో విడుదల చేయనున్నాం. తెలుగుతోపాటు హిందీ ట్రైలర్‌ని కూడా అదే వేదికపై విడుదల చేస్తాం. సినిమాపై అంచనాలు పెంచేలా ట్రైలర్ ఉంటుంది' అని మేకర్స్ తెలిపారు. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్.సింహా కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రంలో యువ, నాగమహేశ్, వంశీ, గగన్ విహారీ, సురేందర్‌రెడ్డి ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సౌందర్‌రాజన్.ఎస్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: మధు క్రియేషన్స్, సంపత్‌నంది టీమ్ వర్క్స్.

## ఏజ్‌గ్యాప్‌పై కౌంటరిచ్చిన మాళవిక

**టాకీస్:** మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ ప్రస్తుతం హృదయపూర్వం చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మాళవిక మోహనన్ కథానాయికగా నటిస్తుంది. సత్యన్ అంతికాడ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం షూటింగ్ మొదటి షెడ్యూల్ పూర్తయినట్లు ప్రకటిస్తూ మాళవిక మోహనన్ ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ఒక పోస్ట్‌ను పంచుకున్నారు. దీంత ఆమె పోస్ట్ పై నెటిజన్స్ ట్రోల్స్ చేశారు. మోహన్‌లాల్, మాళవిక మధ్య వయస్సు వ్యత్యాసం గురించి కామెంట్స్ చేశారు. దీంతో తన గురించి వచ్చిన నెగిటివ్ కామెంట్స్ పై మాళవిక తీవ్రంగా స్పందించింది. "నువ్వు ఇలా మనుషులను ఎలా తూకం వేస్తావో తెలుసా?" అంటూ కౌంటరిచ్చిం ది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరలవుతుంది. మాళవిక మోహనన్, నటుడు మోహన్ లాల్ తో కలిసి సినిమా సెట్స్ పై ఫోటోస్ పంచుకుంది. మోహన్‌లాల్ సర్ సత్యన్ సర్ వంటి ప్రముఖుల నుండి నేను చాలా నేర్చుకున్నాను. సినిమాలో వాళ్ళు మ్యాజిక్ చేసే విధానం నన్ను ఆకట్టుకుంది అంటూ రాసుకొచ్చింది. చాలా ప్రతిభావంతులైన వ్యక్తులతో కలిసి పనిచేశానని, తెక్కడిలోని అందమైన కొండలు, తేయాకు తోటలలో సంతోషంగా ఒక నెల గడిపానని తెలిపింది. ప్రస్తుతం మాళవిక మోహనన్ ప్రభాస్ సరసన రాజాసాబ్ చిత్రంలో నటిస్తుంది.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.